ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
తిరుపతి
జిల్లా వార్తలు
ఆదివారం 11 ఫిబ్రవరి 2024

రోడ్డు వేస్తేనే ఓటేస్తాం



షార్ రోడ్డులో అట్టకానితిప్ప వద్ద ఫ్లెక్సీ కడుతున్న యువత


శనివారం ఉదయం పేర్నాడు రోడ్డులో గ్రామస్తుల నిరసన

● పులికాట్ పల్లెల పోరుబాట ● అన్ని పార్టీల నాయకుల మద్దతు కూడగడుతున్న యువత

ప్రభుత్వాలు మారుతున్నాయి.. ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులు వస్తున్నారు.. వెళ్తున్నారు. అయినా పులికాట్ తీర ప్రాంత రహదారులు మాత్రం బాగుపడడం లేదు. దేశానికే తలమానికమైన రాకెట్ ప్రయోగ కేంద్రం షార్ పక్కనే ఉన్న ఈ గ్రామానికి నేటికీ సరైన రోడ్డు మార్గం లేదు. ఉన్న అరకొర గ్రావెల్ రోడ్డు సైతం మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో కోతకు గురై అధ్వానంగా మారింది. దీంతో బస్సులు సైతం గ్రామాలకు వెళ్లకపోవడంతో పులికాట్ పల్లె ప్రజలతో పాటు విద్యార్థులకూ అవస్థలు తప్పడంలేదు.దీంతో ఇన్నాళ్లూ ఎదురుచూసిన పులికాట్ పల్లె ప్రజలు పోరుబాటకు సిద్ధమయ్యారు.గ్రామాల్లో యువత ముందుకొచ్చి అన్ని గ్రామాల్లో సమావేశాలు పెట్టుకొని తారు రోడ్డు వేస్తేనే ఓటు.. లేదంటే ఎన్నికలు బహిష్కరిస్తామంటూ పార్టీలకతీతంగా తీర్మానాలు చేస్తున్నారు. కడపత్ర, దామరాయి, కొరిడి, వేనాడు పంచాయతీల్లోని గ్రామస్తులు శుక్రవారం రాత్రి తీర్మానాలు చేశారు. ఈ నాలుగు పంచాయతీల్లో దాదాపు 29 గ్రామాల ప్రజలున్నారు. పులికాట్ మధ్యలో గ్రామాలుండడంతో పర్యావరణానికి ఇబ్బందని సరస్సు సమీపంలో తారు రోడ్డు నిర్మాణం చేపట్టకూడదంటూ వన్యప్రాణి విభాగం అడ్డంకులు చెప్పడంతో తారు రోడ్డు కలగానే మిగిలింది. మిచౌంగ్ తుఫాన్ తీర ప్రాంతాలను ముంచెత్తడంతో ఉన్న గ్రావెల్ రోడ్లూ పూర్తిగా మునిగి కోతకు గురయ్యాయి. దాదాపు నెల రోజుల పాటు గ్రామాలకు బస్సులు వెళ్లలేని పరిస్థితి. ప్రభుత్వం కూడా రోడ్డు మరమ్మతుల గురించి పట్టించుకోలేదు. దీంతో పులికాట్ పల్లెలతో పాటు తడ మండలం వేనాడు దీవివాసులు కూడా తారు రోడ్డు కోసం పోరుబాటకు సిద్ధపడ్డారు. పక్కనే ఉన్న శ్రీహరికోటకు తారురోడ్డు వుంటే లేని అభ్యంతరం ప్రజలు నివాసం ఉండే గ్రామాలకు రోడ్డేస్తే పర్యావరణం దెబ్బతింటుందా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్షులు ముఖ్యమా.. ప్రజలు ముఖ్యమా ప్రభుత్వాలు తేల్చుకోవాలంటూ ఆయా గ్రామాల్లో సమావేశాలు పెట్టి తీర్మానాలతో నిరసన వ్యక్తం చేస్తున్నారు. శ్రీహరికోటకు వెళ్లే మార్గాల్లో పలుచోట్ల రోడ్డు ముద్దు.. ఓటు వద్దు అంటూ ఫ్లెక్సీలు కట్టారు. రోడ్డే ముద్దు.. పార్టీలు వద్దు అంటూ తారు రోడ్డు నిర్మాణం కల్పించకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామంటూ అల్టిమేటం జారీ చేస్తున్నారు.అన్ని పార్టీలకు సంబంధించిన నాయకులు కూడా కలిసి పోరాటం చేస్తామని ముందుకొస్తున్నారు. తారు రోడ్డు నిర్మాణం జరిగే వరకు పోరాటాలు సాగుతాయని పులికాట్ పల్లెవాసులు హెచ్చరిస్తున్నారు.


శుక్రవారం రాత్రి సమావేశమైన వేనాడుమూల గ్రామస్తులు

-సూళ్లూరుపేట

అద్భుతం... సృజనాత్మక దృక్పథం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10: గురువుల నేతృత్వంలో విద్యార్థుల సృజనాత్మకత వెల్లివిరిసింది. శ్రీకాళహస్తి జడ్పీ బాలుర హైస్కూల్లో శనివారం ప్రారంభమైన రెండు రోజుల జిల్లాస్థాయి ఇన్స్పైర్ మనక్ వైజ్ఞానిక ప్రదర్శనలో పలువురు విద్యార్థులు తమ ఆవిష్కరణలతో ప్రముఖుల మెప్పు పొందారు.దైనందిన జీవనంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించే సరికొత్త ఆలోచనలకు విద్యార్థులు శ్రీకారం చుట్టారు.ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఈవో శేఖర్,జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, సీఎంవో సురేష్, ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఎన్ఐఎం పరిశీలకులు మహ్మద్ రయిజ్, దివ్యాన్ష్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్ తదితరులు

మద్యం సేవిస్తే బండి నడవదంతే



శ్రీకాళహస్తి పట్టణం బాబు అగ్రహారంలోని హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న పవన్ కుమార్. ఉపాధ్యాయురాలు వరలక్ష్మి పర్యవేక్షణలో ఈ ప్రయోగాన్ని ప్రదర్శించాడు.మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్న విషయం తెలిసిందే. వీటిని అరికట్టేందుకు ఆల్కహాల్ సెన్సార్, వాయిస్ సెన్సార్, మైక్రో కంట్రోలర్ పరికరాలతో సర్క్యూట్‌ను రూపొందించారు. వాహనంలోని ఇంజన్‌కు దీన్ని అనుసంధానం చేస్తారు. డ్రైవర్ మద్యం సేవించి సీట్లో కూర్చొగానే నోటి నుంచి వెలువడే వాసన, మాటల శబ్దాల నుంచి ఈ పరికరం మద్యం పరిమాణాన్ని గుర్తిస్తుంది. పరిమితి దాటినట్లు మైక్రో కంట్రోలర్ నిర్ధారణకు వస్తే వెంటనే ఇంజన్ దానంతట అదే ఆగిపోతుంది.డ్రైవర్ మారేవరకు వాహనం కదలదు.

గుండెపోటును ముందుగానే గుర్తిస్తే



బుచ్చినాయుడు కండ్రిగ మండలం సహజ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న కార్తీక్ ఉపాధ్యాయుడు సురేష్ నాయుడు పర్యవేక్షణలో మంచి ప్రయోగాన్ని ప్రదర్శించాడు. ఇటీవల గుండెపోటుతో చాలామంది హఠాన్మరణం చెందుతున్న నేపథ్యంలో హృదయ స్పందనను ముందుగానే పసిగట్టి ఆ వ్యక్తికి అలారం రూపంలో హెచ్చరిక వస్తే వెంటనే వైద్యం పొందవచ్చు కదా అని ఆలోచించాడు. ఎలక్ట్రానిక్ సెన్సార్ ద్వారా గుండెపోటు సంభవించడానికి ముందు శబ్దంతో పాటు హృదయ స్పందనలో తేడాలను డిస్ప్లేలో ఈ పరికరం చూపుతుంది.

కునుకుతో ప్రమాదాలకు చెక్



చంద్రగిరి మండలం ఐతేపల్లి జడ్పీ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న నిహిత టీచరు సురేష్ పర్యవేక్షణలో కునికిపాట్లతో జరిగే రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టే ప్రయోగాన్ని ప్రదర్శించింది. కనురెప్పల కదలిక ఆధారంగా పనిచేసే కళ్ళజోడును రూపొందించింది.డ్రైవింగులో ఈ కళ్లద్దాలు ధరించి వాహనం నడుపుతున్నప్పుడు కునుకు తీస్తే వెంటనే అద్దాల నుంచి శబ్దంతో హెచ్చరిక వస్తుంది. అలాగే వైబ్రేషన్ రావడంతో డ్రైవరు అప్రమత్తం కావచ్చు.

రైలు పట్టాలపై విద్యుదుత్పత్తి



రేణిగుంట జడ్పీ హైస్కూల్లో టెన్త్ చదువుతున్న ఈ రవీంద్ర ఉపాధ్యాయుడు నాగరాజు సూచనలతో రైలు పట్టాలపై విద్యుదుత్పత్తి ప్రయోగాన్ని ఆవిష్కరించారు. పట్టాలపై రైలు చక్రాలు దొర్లే సమయంలో మెకానికల్ ఎనర్జీ ఉద్భవిస్తుంది. దీనినే కైనెటిక్ ఎనర్జీ అంటారు. రైలు పట్టాలపై డైనమో సిద్ధాంతం ద్వారా మెకానికల్ ఎనర్జీతో విద్యుదయస్కాంత శక్తిని ఉత్పత్తి చేయవచ్చు. దానిని ఏసీ కరెంటుగా నిల్వ చేసుకోవడం ద్వారా తిరిగి అవసరాలకు డీసీ కరెంటుగా కన్వర్ట్ చేసుకోవచ్చు. రైలు పట్టాలపై వృథాగా పోతున్న మెకానికల్ శక్తిని విద్యుత్ శక్తిగా మార్చే ఆలోచన ఇది.

రుయాస్పత్రికి వెంకటగిరి యువకుడి కళ్లు దానం

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 10 : తిరుపతి రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన వ్యక్తి కళ్లను అతడి కుటుంబ సభ్యులు శనివారం దానం చేశారు. వెంకటగిరి మండలం యల్లంపల్లికి చెందిన సీహెచ్ సాయిరాం(33) అనారోగ్యంతో రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు.ఈ విషయం తెలుసుకున్న కంటి విభాగం ప్రొఫెసర్ డాక్టర్ చలపతిరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను కలిసి కంటిదానం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించడంతో వారు అంగీకరించారు. వెంటనే సాయిరాం కళ్లను సేకరించి రుయాస్పత్రిలోని ఐ బ్యాంక్‌కు తరలించారు.


సీహెచ్ సాయిరాం

పాఠశాల వార్షిక వేడుకలో యువకుడిపై హత్యాయత్నం

● భయభ్రాంతులైన మహిళలు,పిల్లలు


గాయపడిన మీర్జావలి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10: యువకుడిపై హత్యాయత్నం జరగడంతో పాఠశాల వార్షిక వేడుకల్లో కలకలం రేగింది. ఈ ఘటన శ్రీకాళహస్తిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడి బంధువుల కథనం మేరకు...శ్రీకాళహస్తి పట్టణం మంచినీళ్ల గుంట ప్రాంతానికి చెందిన మీర్జావలి (22) ఓ చిల్లర దుకాణంలో పనిచేస్తుంటాడు. వీఎంసీ కూడలిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో శనివారం వార్షిక వేడుకలు జరిగాయి. ఇందులో భాగంగా కొందరు యువకులు అక్కడికి చేరి చిందేశారు. వారిలో కొందరు మీర్జావలి పైన పడుతూ ఉండడంతో దూరంగా జరగాలంటూ మందలించాడు. దాంతో ఆగ్రహించిన యువకులు వెంటనే కత్తి తీసి మీర్జావలి వీపులో పొడిచి పరారయ్యారు. ఈ దుర్ఘటనతో ఆ ప్రాంగణం అంతా అల్లకల్లోలంగా మారింది. మహిళలు, పిల్లలు భయభ్రాంతులయ్యారు. తీవ్రంగా గాయపడిన మీర్జావలీని స్థానికులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.రక్తస్రావం ఆగకపోవడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు.

తమిళ యువకుడి మృతదేహం వెలికితీత


శ్యామ్ మృతదేహం

నాగలాపురం, ఫిబ్రవరి 10: నాగలాపురం మండల పరిధిలోని సద్దికూడు మడుగుకు విహార యాత్రగా వచ్చి గురువారం గల్లంతైన యువకుడు శ్యామ్(20) మృతదేహాన్ని ఎట్టకేలకూ శనివారం వెలికితీశారు. రెండు రోజులుగా నాగలాపురం పోలీసులు, సత్యవేడు అగ్ని మాపక దళ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినా మృతదేహం ఆచూకీ దొరకలేదు.మూడవ రోజైన శనివారం ఉదయం మళ్లీ పోలీసులు మడుగులో గాలింపు చర్యలు చేపట్టి శ్యామ్ మృతదేహాన్ని వెలికితీశారు.సంఘటనా స్థలంలోనే సత్యవేడు ప్రభుత్వ వైద్యాధికారి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి తల్లిదండ్రులకు శవాన్ని అప్పగించారు. ఎస్ఐ ఓబయ్య కేసు నమోదు చేశారు.

వైసీపీ కార్పొరేటర్ మాయాజాలం

రెండిళ్లలో 60 ఫేక్ ఓట్లను గుర్తించిన టీడీపీ

తిరుపతి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వైసీపీ నేతల దొంగ ఓట్ల మాయాజాలాలు మరిన్ని వెలుగుచూస్తున్నాయి. 34వ డివిజన్ కార్పొరేటర్ శ్రావణి భర్త మునిరామిరెడ్డికి చెందిన ఇంటిలో 60కి పైగా దొంగ ఓట్లున్నట్టు తాజాగా టీడీపీ నేతలు గుర్తించారు. రైల్వేకాలనీలోని కార్పొరేటర్‌కు చెందిన పాత డోరు నెంబరు 18-4-54 (ఎన్నికల డోరునెంబరు 18-38 ఎస్4-402) రెండు ఇళ్లలో పెద్దఎత్తున దొంగ ఓట్లున్నట్టు తెలియడంతో టీడీపీ నేతలు అక్కడికెళ్లి ఓటరు జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ పాత డోరు నెంబరు పేరుతో 30ఓట్లు, ఎన్నికల డోరు నెంబరు పేరుతో 30కిపైగా ఓట్లున్నాయని చెప్పారు. ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్ల తరహాలోనే కార్పొరేటర్లు, వైసీపీ చోటా నాయకులు కూడా దొంగ ఓట్లను చేర్చడంలో అత్యుత్సాహం చూపిస్తున్నారన్నారు. కార్పొరేటర్ భర్త బూత్ నెంబర్లు 115, 118, 114ల్లో ఓట్లు పెట్టుకున్నారన్నారు. తమ్ముడి భార్యకు రెండు ఓట్లు నమోదు చేసుకున్నారన్నారు. ఇక్కడ డెత్ ఓట్లు తొలగించమని బీఎల్వో నుంచి కలెక్టర్ వరకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానిక టీడీపీ నేతలు సుగుణమ్మకు ఫిర్యాదు చేశారు. ఒకే పేజీలో ఇన్ని ఫేక్ ఓట్లు ఎలా వస్తాయన్న ఆమె వీటన్నింటిపై ఈసీకి ఫిర్యాదు చేస్తామన్నారు.టీడీపీ క్లస్టర్ ఇంచార్జి మునిశేఖర్ రాయల్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, ప్రకాష్, యూనిట్ ఇంచార్జి సురేష్ కుమార్, నాయకులు బుల్లెట్ రమణ, మహేష్ యాదవ్, కంకణాల రజనీకాంత్, సుబ్బుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


దొంగ ఓట్లను గుర్తించిన ఇంటిముందు టీడీపీ నేతలు








అలరించిన ఆర్ట్ క్యాంప్




తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 10: తిరుపతి ఆర్ట్ సొసైటీ (టీఏఎస్) ఆధ్వర్యంలో శనివారం నేషనల్ ఆర్ట్ క్యాంప్, ప్రదర్శన ప్రారంభమైంది. శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను టీటీడీ విద్యాశాఖ అధికారి భాస్కరరెడ్డి ప్రారంభించారు. మొదటిరోజు తమిళనాడు, పశ్చిమబెంగాల్, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన చిత్రకారులు పాల్గొన్నారు. మన రాష్ట్రానికి చెందిన 50 మంది చిత్రకారులు తమ చిత్రాలను ప్రదర్శించారు. లైవ్ పెయింటింగ్ పలువురిని ఆకర్షించింది. ఈ ప్రదర్శన ఆదివారం కూడా కొనసాగుతుంది. నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఉమ ముద్దుబాల గౌరవ అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో టీఏఎస్ అధ్యక్షుడు హేమాక్షిఆచారి, కార్యదర్శి ఈ.బాలసుబ్రమణ్యం, సింగంపల్లి సత్యనారాయణ, రామచంద్రయ్య, ఆనంద్, హేమంత్ బాబు, గాయత్రీదేవి, రమాదేవి పాల్గొన్నారు.

29నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 10: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 29నుంచి మార్చి 8వ తేది వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.28న సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుంది.29న ఉదయం మీనలగ్నంలో ధ్వజారోహణం నిర్వహిస్తారు.అదేరోజు రాత్రి పెద్దశేషవాహనంతో వాహన సేవలు ప్రారంభమవుతాయి. మార్చి 8న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

రాజ్యాంగ పరిరక్షణ బహుజనులకే సాధ్యం

చంద్రగిరి, ఫిబ్రవరి 10: మనువాదుల పాలనలో భారత రాజ్యాంగం, కాన్షీరాం సిద్ధాంతం ప్రమాదపు అంచున ఉన్నాయని, వాటి పరిరక్షణ బహుజనులకే సాధ్యమవుతుందని బహుజన సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ అన్నారు. చంద్రగిరిలో శనివారం బీఎస్పీ ఆధ్వర్యంలో ప్రచార కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలో వైసీపీ, టీడీపీ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కాయని తెలిపారు. అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పుణ్యమూర్తి, బాదూరు ఎల్లయ్య, శశికుమార్, జయదేవ్, రెడ్డిలోకేష్, రవి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు చిన్నపిల్లల కోసం వైద్య శిబిరం

పాకాల, ఫిబ్రవరి 10: తెలుగుదేశం పార్టీ నాయకుడు పులివర్తి నాని ఆధ్వర్యంలో ఆదివారం చిన్నపిల్లల కోసం వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. స్థానిక నీలామాలతి కల్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి వైద్య సేవలు అందిస్తారు. 14 సంవత్సరాల లోపు వయసు కలిగిన చిన్న పిల్లలను పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తారు. ఈ అవకాశాన్ని పరిసరవాసులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

టీడీపీని ఆదరించండి



పాకాల, ఫిబ్రవరి 10: రాష్ట్ర భవిష్యత్తు కోసం అహర్నిశలూ శ్రమించే చంద్రబాబును గెలిపించుకుందామని పులివర్తి సుధారెడ్డి కోరారు. దామలచెరువులో ఆదివారం టీడీపీ, జనసేన కార్యకర్తలతో కలిసి మీ ఇంటివద్దకు పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మినీ మ్యానిఫెస్టో సంక్షేమ పథకాలను వివరించారు. వైసీపీ అరాచక పాలనను అంతం చేయాలని కోరారు. చంద్రగిరి నియోజకవర్గంలో గంజాయి మత్తులో అమాయకులపై దాడులు జరుగుతున్నాయన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. పులివర్తి నానిని ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు.

ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక



వెంకటాద్రి, హనుమంతరావు

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి10: మండల ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం కార్యవర్గం ఎన్నిక జిల్లా కన్వీనర్ అంజిమేటి మల్లీశ్వర్ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. మండల అధ్యక్షుడిగా వెంకటాద్రి, ప్రధాన కార్యదర్శిగా హనుమంతరావు, ఆర్థిక కార్యదర్శిగా అప్పన్న ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మల్లీశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా పోరాటం చేస్తామన్నారు.

చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని..



జీవన్‌కుమార్ రెడ్డి

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 10: చంద్రబాబు మళ్లీ సీఎం కావాలని ఓ దివ్యాంగుడు తిరుమలకు కాలినడకన వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. పెరుమాళ్లపల్లెకు చెందిన టీడీపీ అనుబంధ దివ్యాంగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీవన్‌కుమార్‌రెడ్డి శ్రీవారి మెట్టు మార్గాన శనివారం తిరుమలకు కాలినడకన వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జీవన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అందించవలసిన వాహనాల పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఇప్పటికైనా అర్హులైన దివ్యాంగులందరికీ వాహనాలు అందించాలని కోరారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడితేనే దివ్యాంగులకు న్యాయం జరుగుతుందని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 10: చంద్రగిరి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన అనారోగ్య బాధితులకు సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పంపిణీ చేశారు. మంగళం పంచాయతీ బీటీఆర్ కాలనీకి చెందిన దీన్‌దయాల్‌కు రూ. 80 వేలు, పాకాల మండలం వరదప్పనాయుడుపేటకు చెందిన చలపతికి రూ. 70 వేలు చెక్కులను తుమ్మలగుంటలోని తన నివాసంలో అందజేశారు.

అమ్మవారికి హారం విరాళం



ఆలయ అధికారులకు హారాన్ని అందజేస్తున్న అశ్విన్

తిరుచానూరు, ఫిబ్రవరి 10: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారికి శనివారం హైదరాబాద్‌కు చెందిన అశ్విన్ రూ.9.22లక్షలు విలువైన 120 గ్రాముల బంగారు లక్ష్మీకాసుల హారాన్ని కానుకగా అందజేశారు. ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్‌కు హారాన్ని అందజేశారు. అనంతరం అశ్విన్ కుటుంబ సభ్యులు కుంకుమార్చన సేవలో పాల్గొన్నారు. సూపరింటెండెంట్ శేషగిరి, అర్చకులు బాబుస్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా పద్మావతి అమ్మవారిని దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శనివారం రాత్రి దర్శించుకున్నారు.

టెన్త్ పరీక్షల నిర్వహణలో మినహాయింపు ఇవ్వండి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 10: టెన్త్ పబ్లిక్ పరీక్షల నిర్వహణలో వైద్యపరమైన, ఇతర సమస్యలతో బాధపడే టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని, గతేడాది పరీక్షలకు సంబంధించిన రెమ్యూనరేషన్, స్పాట్ వాల్యుయేషన్ బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఏపీఉపాధ్యాయసంఘ(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజి కోరారు. జిల్లా ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్‌గా నియమితులైన గురుస్వామిరెడ్డిని ఆయన నేతృత్వంలో పలువురు టీచర్లు శనివారం మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. బాలాజి మాట్లాడుతూ వేసవిసెలవుల్లో పనిచేసే టీచర్లకు ఆర్జిత సెలవుల మంజూరుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.నాగరాజు, జి.సాంబిరెడ్డి పాల్గొన్నారు.

మరో అయోధ్యలా పేటమిట్ట

- తీర్చిదిద్దుతామన్న గల్లా రామచంద్ర నాయుడు



పూతలపట్టు, ఫిబ్రవరి 10: 'కోట్లు సంపాదించినా.. జన్మనిచ్చిన ఊరిని మరువరాదు. సొంతూరికి ఏం చేశామన్న ఆలోచన అందరిలోనూ రావాలి. నా స్వగ్రామం పేటమిట్టను మరో అయోధ్యలా తీర్చిదిద్దడమే ధ్యేయం' అని అమరరాజా గ్రూపు సంస్థల వ్యవస్థాపకుడు గల్లా రామచంద్ర నాయుడు అన్నారు. శనివారం ఆయన పూతలపట్టు మండలం పేటమిట్టలో నిర్మిస్తున్న రామాలయ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. సంప్రదాయాలను పునరుద్ధరించడమేగాక ప్రజలంతా కలసిమెలసి ఉండాలన్న ఉద్దేశంతో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఆయన మాటల్లోనే.. 'గ్రామస్థుల సహకారంతో 97 సెంట్ల భూమిని కొనుగోలు చేసి ఇక్కడ తొలుత విరూపాక్షమ్మ గుడిని నిర్మించాం. 2019 జనవరి 20వ తేదీన సొంత నిధులతో పాటు భక్తులు అందజేసిన విరాళాలతో సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి కొలువై ఉండేలా ప్రధాన ఆలయాన్ని నిర్మిస్తున్నాం. దీనికి ఓవైపు కృష్ణ మందిరం, మరోవైపు విఘ్నేశ్వర ఆలయం ఉంటాయి. గ్రామమంతా ప్రతిధ్వనించేలా భారీ గంటలు ఏర్పాటు చేస్తున్నాం. ఆలయ సముదాయంలో సమావేశాల నిర్వహణకు మినీ ఓపెన్ ఆడిటోరియం, సామూహిక కార్యక్రమాల కోసం కమ్యూనిటీ హాలు, చిన్నపిల్లల కోసం పార్కు ఉంటాయి' అని రామచంద్ర నాయుడు వివరించారు. ఇక ఆలయ పరిసరాల గుండా ప్రవహించే తేనేపల్లి చెరువు కాలువపై 160 మీటర్ల పొడవున కల్వర్టును నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. దీన్ని అమరరాజా గ్రూపు సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల నుంచి రూ.3.75 కోట్ల వ్యయంతో నిర్మించారని తెలిపారు.

రేపటినుంచి కుంభాభిషేక మహోత్సవాలు

కోదండరామస్వామి ఆలయ సముదాయానికి సోమవారం నుంచి నాలుగు రోజులపాటు కుంభాభిషేక మహోత్సవాలు జరుగుతాయని రామచంద్ర నాయుడు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అమరరాజా సంస్థలు పక్క రాష్ట్రాలకు వెళ్లడంపై, కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చిన నోటీసులపై మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. ఎటువంటి నోటీసులు ఇచ్చినా, తాము ఏ తప్పూ చేయలేదనే దృక్పథంతో ధైర్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు.ఏ పార్టీ అధికారంలో ఉన్నా తమ సంస్థలకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. తమ సంస్థల ఏర్పాటుతో పేటమిట్టకు ఇప్పటికే ప్రపంచంలోనే గుర్తింపు వచ్చిందన్నారు.సర్పంచ్ గల్లా రాధాకృష్ణ , పారిశ్రామికవేత్త గల్లా రాజశేఖర్ , పీఆర్వో లు బాబ్జీ, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

చెవిరెడ్డి రాజకీయ వ్యాపారి : టీడీపీ



తిరుపతి రూరల్, ఫిబ్రవరి 10: వ్యాపారమే రాజకీయయంగా, తాయిలాలే పెట్టుబడిగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చెవిరెడ్డి భాస్కరరెడ్డి అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పేర్కొన్నారు. లింగేశ్వర్‌నగర్ పంచాయతీ ఎంకే.నాయుడు కాలనీలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ రెండు సార్లు నమ్మకంతో ఓటేసిన ప్రజలకు ఎమ్మెల్యే చేసిందేమీ లేదన్నారు. నాలుగు పదవులు అలంకరించి తన ఖజానా నింపుకోవడానికే సమయం సరిపోతోందని పేర్కొన్నారు. రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులు, వంతెనలు నిర్మించడం పూర్తిగా విస్మరించారని అన్నారు. గంజాయి మాత్రం పల్లెల్లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని మండిపడ్డారు. దొంగ ఓట్ల నమోదుతో చంద్రగిరి ప్రతిష్ఠను దేశవ్యాప్తంగా దిగజార్చారని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ టీడీపీ అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న గర్వకారణం

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 10 : మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వడం తెలుగు ప్రజలకు గర్వకారణమని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పీవీ దేశ ప్రగతి కోసం తీసుకువచ్చిన ఆర్థిక సంస్కరణలు చిరస్మరణీయమైనవని కొనియాడారు. తిరుపతి విమానాశ్రయానికి పీవీ నరసింహారావు టెర్మినల్‌గా నామకరణం చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కోరారు. స్వామినాథన్‌కు భారతరత్న ప్రతి రైతూ గర్వపడాల్సిన విషయమన్నారు.

అధిక ధరకు మద్యం విక్రయం

- ఎస్ఈబీ అధికారులు కొట్టారంటూ పెట్రోలు పోసుకున్న సూపర్‌వైజర్



ఎస్ఈబీ స్టేషన్ వద్ద మద్యం దుకాణాల సిబ్బంది



గౌతం, చరణ్‌కుమార్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 10: తిరుపతిలోని ఓ మద్యం దుకాణంలో సిబ్బంది అధిక ధరకు మద్యాన్ని విక్రయిస్తుండటాన్ని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. సదరు సేల్స్‌మాన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. చిత్తూరు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) ఆధ్వర్యంలోని విజిలెన్స్ అధికారులు శనివారం నగరంలోని పలు మద్యం దుకాణాల్లో రహస్య తనిఖీలు చేపట్టారు. అన్నమయ్య కూడలిలోని మద్యం దుకాణం నం 10025లో మద్యాన్ని కొనుగోలు చేశారు. సేల్స్‌మాన్ గౌతం బాటిల్‌పై 10 రూపాయలు అదనంగా వసూలు చేశారు. దీంతో ఎక్సైజ్ విజిలెన్స్ అధికారులు అతన్ని అదుపులోకి తీసుకుని తిరుపతి అర్బన్ ఎస్ఈబీ స్టేషన్‌కు తరలించి కేసు నమోదుకు సిఫారసు చేశారు. ఈలోపు అతనికి మద్దతుగా పలు మద్యం దుకాణాల సిబ్బంది ఎస్ఈబీ స్టేషన్‌కు చేరుకున్నారు. ఎస్ఈబీ సిబ్బంది అతనిపై చేయి చేసుకుందని, కేసు నమోదు చేయకుండా వదిలేయాలని అర్బన్ ఎస్ఈబీ సీఐ సుబ్బారెడ్డిని కోరారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు విషయం కొలిక్కి రాకపోవడంతో దుకాణ సూపర్‌వైజర్ జి.చరణ్‌కుమార్ ఒంటిపై పెట్రోలు పోసుకున్నారు. గౌతంపై కేసు నమోదు చేసినా, అతని ఉద్యోగానికి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐ సుబ్బారెడ్డి వారితో చర్చించి, ఉద్యోగానికి భరోసా ఇవ్వడంతో గౌతం, చరణ్‌కుమార్‌తో కలిసి సిబ్బంది వెనుదిరిగారు. కాగా, మద్యం దుకాణాల్లో తనిఖీ చేసి, సిబ్బందిని అదుపులోకి తీసుకునే అధికారం తమకు లేదని ఎస్ఈబీ సీఐ సుబ్బారెడ్డి ఆంధ్రజ్యోతికి చెప్పారు. ఏసీ విజిలెన్స్ బృందం తనిఖీలు చేసి గౌతంను తమ స్టేషన్‌కు తీసుకొచ్చారని, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసే బాధ్యత తమదేనని అన్నారు. నిందితుడిని తాము కొట్టామని చెప్పడం అబద్ధమని అన్నారు.

బ్లాక్‌లో మద్యం విక్రయిస్తున్న వాచ్‌మెన్‌పై కేసు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 10: బ్లాక్‌లో మద్యం విక్రయిస్తున్న చెర్లోపల్లి ప్రభుత్వ మద్యం దుకాణ వాచ్‌మెన్‌పై తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం... పుదిపట్లకు చెందిన టి.గోవిందు చెర్లోపల్లి మద్యం దుకాణం వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. దుకాణం నుంచి మద్యం బాటిళ్లను ఎమ్మార్పీకి కొనుగోలుచేసి, అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకోవడం ప్రారంభించాడు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం వరకు మద్యాన్ని బ్లాక్‌లో విక్రయిస్తుండేవాడు. రహస్య సమాచారం మేరకు తిరుపతి రూరల్ పోలీసులు మద్యం దుకాణం వద్దకు చేరుకుని అతన్ని తనిఖీ చేసి, ఏడు మద్యం బాటిళ్లను గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ సుమారు మూడువేల రూపాయలు ఉంటుందని ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపారు.

నేడు అయోధ్యకాండ అఖండ పారాయణం

తిరుమల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై ఆదివారం ఏడవ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం నిర్వహించనున్నారు. అయోధ్యకాండలోని 22 నుంచి 25 సర్గల వరకు ఉన్న 155 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 180 శ్లోకాలను ఉదయం 7 నుంచి 9 గంటల వరకు పారాయణం చేస్తారు. ఎస్వీబీసీలో ప్రత్యక్షప్రసారం చేస్తారు.

టీటీడీ డిప్యూటీ ఈవోగా హరికృష్ణ

తిరుపతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి):తిరుమల తిరుపతి దేవస్థానం డిప్యూటీ ఈవోగా తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ వైస్ ఛైర్మన్ హరికృష్ణను నియమిస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటేషన్‌పై ఏడాది పాటు ఆయన ఈ హోదాలో కొనసాగనున్నారు. ఇప్పటికే ఖాళీగా ఉన్న డిప్యూటీ ఈవో స్థానంలో ఆయనను భర్తీ చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, తుడ వైస్ చైర్మన్ కన్నా టీటీడీ డిప్యూటీ ఈవో బాధ్యత పెద్దదేమీ కాదు. కన్ఫర్డ్ ఐఏఎస్‌కు దగ్గర్లో ఉన్న వీసీని టీటీడీ డిప్యూటీ ఈవోగా నియమించడం గమనార్హం.

బీజేపీతో రహస్య ఒప్పందం కోసమే జగన్ ఢిల్లీ పర్యటన

- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్



మీడియాతో మాట్లాడుతున్న జంగా గౌతమ్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 10 : రాష్ట్రంలో ఐదుకోట్ల ప్రజల ప్రయోజనాలను, రాష్ట్ర భవిష్యత్తును పక్కనపెట్టి బీజేపీతో రహస్య ఒప్పందాల కోసమే ముఖ్యమంత్రి జగన్ ఢిల్లీ పర్యటన చేశారని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ విమర్శించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ అన్ని రాష్ట్రాల నుంచి కేంద్ర ప్రభుత్వం నివేదికలు తెప్పించుకుని బడ్జెట్ ప్రవేశపెట్టిందని, ఆ తంతు ముగిశాక రాష్ట్ర ప్రయోజనాల పేరుతో జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లడం, మీడియాతో మా ట్లాడకుండా వెళ్లిపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.చంద్రబాబుతో పొత్తుకు పోవద్దని, అవసరమైతే బీజేపీకి రహస్య ప్రియురాలుగా ఉంటానని ఒప్పందం చేసుకుని వచ్చారా అంటూ ఎద్దేవా చేశారు. సొంత ఎజెండా కోసం ప్రజల సొమ్ముతో ప్రత్యేక విమానంలో తిరగడం మంచి పద్ధతి కాదన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు



తిరుపతి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఓటరు నమోదు అధికారి, మున్సిపల్ కమిషనర్ అదితి సింగ్ అన్నారు. శనివారం నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలు, ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలోని స్ట్రాంగ్ రూమ్‌ను అధికారులతో కలసి ఆమె పరిశీలించారు. ఈవీఎం, బ్యాలెట్ బాక్సులు భద్రపరిచేందుకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో గాలి, వెలుతురు బాగా వచ్చేలా, ఫ్యాన్లు, బల్బుల సమస్య లేకుండా చూడాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం ఉండాలన్నారు. వృద్ధులు, వికలాంగులు వెళ్లేందుకు ర్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. ఆమె వెంట డీసీ అమరయ్య, డీఈ మహేష్, తేజస్విని, సెక్టోరల్ ఆఫీసర్స్ బీఎల్వోలు ఉన్నారు.

జగనన్న కాలనీలో సదుపాయాల కల్పనపై సమీక్ష



సమావేశమైన ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

తిరుచానూరు, ఫిబ్రవరి 10: జనగన్న కాలనీ లేఅవుట్‌లో మౌలిక వసతులు కల్పించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ లక్ష్మీశా, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం జగనన్న కాలనీల్లో సదుపాయాల కల్పనపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇంటి స్థలాలను చూపించాలన్నారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ వడమాలపేట, రామచంద్రాపురం మండలాల్లో గ్రావెల్, అప్రోచ్‌రోడ్ వంటి సదుపాయాలను కల్పించి, త్వరగా లబ్ధిదారులకు ఇంటి స్థలాలను చూపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి, జేసీ శుభం బన్సల్, ఆర్డీవోలు నిశాంత్ రెడ్డి, రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

దొంగ ఓట్లు డొంక కదిలించండి

తెలుగుయువత నిరసన



మున్సిపల్ కార్యాలయం ఎదుట టీడీపీ నేతల నిరసన

తిరుపతి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో 35వేల దొంగ ఎపిక్ కార్డుల కుంభకోణం వెనుక సూత్రధారులుగా ఉన్న రాజకీయ నాయకుల పేర్లు బయటపెట్టాలని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్ నాయుడు డిమాండు చేశారు. తెలుగు యువత నాయకులు శనివారం పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఉప ఎన్నికల్లో దొంగ ఓట్లు వేసేందుకు వచ్చిన వారిని పట్టుకుని ఆధారాలతో సహా ఫిర్యాదు చేశామన్నారు. మూడేళ్ల తర్వాత స్పందించిన ఎన్నికల సంఘం ఫేక్ ఎపిక్ కార్డులు తయారు చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటోందన్నారు. అధికారులతో తప్పుడు పనులు చేయించిన రాజకీయ పార్టీ నేతలపై పారదర్శకంగా విచారణ జరపాలన్నారు. చిన్నస్థాయి కంప్యూటర్ ఆపరేటర్లపై నేరం మోపడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు ఆర్సీ శ్రీనివాసులు, సందీప్, కాజా షేక్, బాబి, గాలి పవన్, ప్రశాంత్, ప్రసన్న, గోపి తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్‌ను స్వీకరిస్తున్న తోట శైలజ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 10: తిరుపతికి చెందిన తోట శైలజ బెంగళూరులోని రేవా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఆ యూనివర్సిటీ 8వ స్నాతకోత్సవంలో కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్, యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ పి.శ్యామరాజు నుంచి ఆమె పీహెచ్‌డీ స్నాతకోత్సవ పట్టాను స్వీకరించారు. కంప్యూటర్ సైన్స్ పరిధిలోని పవర్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో పరిశోధన చేశారు. ఆప్టిమైజేషన్ ఆఫ్ కోల్ ఫైర్డ్ బాయిలర్ ఎఫీషియన్సీ ప్రాసెస్ యూజింగ్ యాన్ ఇంటెలిజెంట్ కాంప్యుటేషనల్ అప్రోచ్ అంశంపై ప్రొఫెసర్ సయ్యద్ ముజమిల్ భాషా పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ప్రస్తుతం ఆమె బెంగళూరులోని రేవా యూనివర్సిటీలో గల కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా వ్యవహరిస్తున్నారని యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ శ్యామరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం



మహేష్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 10: తిరుపతి ఐజర్‌లోని కెమిస్ట్రీ పరిశోధకులు వై.మహేష్ డాక్టరేట్ పొందారు. నిట్రిక్ ఆక్సైడ్ ఆక్సిడేషన్ (ఎన్ఓఓ) కెమిస్ట్రీ ఆఫ్ మెటల్ ఆక్సిజన్ అండ్ మెటల్ నైట్రోజిల్ అడక్ట్స్ అంశంపై ప్రొఫెసర్ పంకజ్‌కుమార్ కొలి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు ఐజర్ రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు.

సిద్ధార్థ ఇంజినీరింగ్‌లో జీవనప్రగతిపై సదస్సు

తిరుపతి(విద్య),ఫిబ్రవరి10: తిరుపతిరూరల్ మండలం సి.గొల్లపల్లెలో ఉన్న సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనలియర్ విద్యార్థులకు శనివారం జీవనప్రగతిపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన బెంగళూరుకు చెందిన ఆర్కే కన్సల్టెన్సీ సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఎం.సుధీర్ మాట్లాడుతూ ఐటీ సంస్థల్లో ఉపాధి అవకాశాలను వివరించారు. విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకుంటే మంచి సంస్థల్లో ఉద్యోగాలు సాధించవచ్చని తెలిపారు. ఛైర్మన్ వై.కొండారెడ్డి, సెక్రటరీ వై.ఆనందరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ వై.విజయ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు పి.సాయిప్రసాద్, ఎస్.పవిత్ర, ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్ పి.స్వామినాథన్ పాల్గొన్నారు.

నడక మార్గంలో పాము

తిరుమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల నడక మార్గంలో శనివారం ఓ పాము పట్టుబడింది. అలిపిరి మార్గంలోని మెకాళ్లమిట్ట వద్ద ఆరడుగుల పొడవు కలిగిన జెర్రిపోతు మెట్లపైకి వచ్చింది. గుర్తించిన భక్తులు, దుకాణదారులు పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన అక్కడికి చేరుకుని పామును పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

తిరుపతి

వెంకన్న సేవలో ప్రముఖులు


జయం రవి

తిరుమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, పుదుచ్చేరి ప్రభుత్వ విప్ ఆర్ముగం, తమిళ సినీనటుడు జయం రవి, ఎమ్మెల్సీ ఏసురత్నం ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

న్యాయవాదుల రిలే నిరాహారదీక్ష

తిరుపతి(లీగల్), ఫిబ్రవరి 10 : ఏపీ ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌కు నిరసనగా తిరుపతి కోర్టులో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహారదీక్ష 34వ రోజుకు చేరుకుంది. తిరుపతి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఊటుపల్లె లక్ష్మన్న, మాజీ ఉపాధ్యక్షుడు బి.మురళీమోహన్, న్యాయవాదులు రవితేజ, మునెయ్య, సోము, మురళి, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలు కేటాయించండి


సమావేశంలో మాట్లాడుతున్న వెల్డింగ్ అసోసియేషన్ కార్మికులు

తిరుపతి (తిలక్‌రోడ్), ఫిబ్రవరి 10: నగరంలోని వెల్డింగ్ దుకాణాలను 1996లో ఆటోనగర్‌కు తరలించారని, అప్పటి తుడా అధికారులు అక్కడ లేఅవుట్ వేసి దుకాణాల కేటాయింపునకు తమ వద్ద డబ్బు తీసుకుని ఇప్పటివరకు ఇవ్వలేదని వెల్డింగ్ షాపుల అసోసియేషన్ అధ్యక్షుడు, మహేష్, గౌరవాధ్యక్షుడు కుమార్ పేర్కొన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ ఆటోనగర్‌లో తమకు కేటాయించిన స్థలాల్లో తుడా అధికారులు టెండర్లు పిలిచి నిర్మాణాలు చేపడుతున్నారని, ఈ విషయంపై కోర్టుకు వెళ్లగా స్టే ఇచ్చిందని తెలిపారు. అయినా లెక్క చేయకుండా నిర్మాణాలు చేస్తున్నారని, ఉన్నతాధికారులు స్పందించి తమకు కేటాయించిన స్థలాన్ని ఇప్పించాలని కోరారు. అసోసియేషన్ సభ్యులు శ్రీహరిరెడ్డి, సుబ్రహ్మణ్యం ఆచారి, గోపాల్, మునిరత్నం, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ తహసీల్దారు బాధ్యతల స్వీకరణ


నారాయణరెడ్డి

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 10: తిరుపతి అర్బన్ తహసీల్దారుగా ఎంవీఎస్ నారాయణరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కడప జిల్లా ఎర్రగుంట్ల తహసీల్దారుగా ఉన్న ఏ.నాగేశ్వరరావును తిరుపతి అర్బన్ తహసీల్దారుగా, నీకెదిన్నె తహసీల్దారు నారాయణరెడ్డిని రేణిగుంట తహసీల్దారుగా నియమించారు. అయితే రెండు రోజుల క్రితం నాగేశ్వరరావు రేణిగుంట తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టారు. రేణిగుంట తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టాల్సిన నారాయణరెడ్డి తిరుపతి అర్బన్ తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టారు. అధికారులు, సిబ్బందితో సమావేశమైన ఆయన ఎన్నికల విధులు బాధ్యతతో నిర్వర్తించాలని సూచించారు.

నేటినుంచి ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 10: నగర పరిధిలోని అర్బన్ తహసీల్దారు కార్యాలయం వద్దనున్న శ్రీలక్ష్మి పద్మావతి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. 11న అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమై 20న చక్రస్నానంతో ముగుస్తాయని ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల కోసం తయారు చేయించిన వాహనాలు ఆకట్టుకుంటున్నాయి.

ఎస్టీయూ నగర నూతన కార్యవర్గం


మురళీకృష్ణ - శ్రీనివాసన్ - హరిప్రసాద్‌రెడ్డి - మనోహర్

తిరుపతి(విద్య),ఫిబ్రవరి10: పట్నూలువీధిలోని నగరపాలక ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం సాయంత్రం నిర్వహించిన రాష్ట్రోపాధ్యాయ సంఘ(ఎస్టీయూ) మండల కౌన్సిల్ సమావేశంలో నగర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా ఆర్థిక కార్యదర్శి భీమినేని మునికృష్ణనాయుడు పేర్కొన్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పి.మురళీకృష్ణ, ఎస్‌జే శ్రీనివాసన్, గౌరవాధ్యక్షుడిగా కె.హరిప్రసాద్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా పి.మనోహర్, అసోసియేట్ అధ్యక్షులుగా ఎం.జ్యోతి, బి.గిరిధర్, ఉపాధ్యక్షులుగా రమాదేవి, వెంకటేష్, లక్ష్మీపతి, రఘునాథ, శారదావేణి, అపర్ణ, హేమమాధురి, గౌరీ, ఉషారాణి, సునీత, రమ్య, ఝాన్సీ, అదనపు కార్యదర్శులుగా వాసు, అనిల్‌కుమార్, మహిళా కన్వీనర్‌గా ద్రాక్షాయణి, జిల్లా కౌన్సిలర్లుగా ధనుంజయనాయుడు, మునికృష్ణనాయుడు, విజయశేఖర్‌రెడ్డి, జగన్నాథం, వేణుగోపాల్, అశోక్, రమేష్‌నాయక్, మైనార్టీ కన్వీనర్‌గా అనిత కుమారి, సీపీఎస్ కన్వీనర్‌గా నవీన్‌కుమార్, ఉపాధ్యాయ వాణి కన్వీనర్‌గా అప్పనలతోపాటు పలువురిని కార్యదర్శులుగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. నూతన కార్యవర్గ ప్రతినిధులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల, ప్రభుత్వ విద్యారంగ సమస్యల పరిష్కారంతోపాటు సంఘ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఫామ్ 6, 7 దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 10: దొంగ ఓట్లు ప్రక్రియలో ఫామ్ 6, 7 దుర్వినియోగంపై ఈసీ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో టీడీపీ సీనియర్ నేత బుజ్జిబాబునాయుడు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండ్ర లక్ష్మీపతి నాయుడు మాట్లాడుతూ దొంగ ఓట్ల ప్రక్రియలో ఈసీ సూత్రధారులను వదిలి పాత్రధారులను సస్పెండ్ చేస్తే ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. అధికారులను ప్రలోభాలకు గురిచేసిన వారిపై కొరడా ఝుళిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆముదాల తులసీదాస్, సుబ్బరాయులు, మన్యం శ్రీనివాసులు, మధుసూదన్‌యాదవ్ పాల్గొన్నారు.

మాజీ కమిషనర్ హరితపై విచారణ చేపట్టాలి

● జనసేన డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్ రాయల్

తిరుపతి (తిలక్‌రోడ్), ఫిబ్రవరి 10: దొంగ ఓట్ల ప్రక్రియలో తిరుపతి నగరపాలక సంస్థ మాజీ కమిషనర్ హరిత పాత్రపై ఈసీ విచారణ చేపట్టాలని జనసేన తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరంలో ఓ బూత్‌కు 1,250 ఓట్లు ఉండగా ప్రతివార్డులోనూ 350 నుంచి 450 దొంగ ఓట్లు ఎక్కించారని ఆరోపించారు. తిరుపతి నియోజకవర్గంలో 34వేల దొంగ ఓట్లు ఉన్నాయని, మాజీ కమిషనర్ హరిత సూచనలతో కొత్తగా 20వేలకు పైచిలుకు దొంగ ఓట్లు ఎక్కించారని ఆరోపించారు. ఆమె పాత్రపై లోతుగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దొంగ ఓట్లతో గెలిచిన ఎంపీ గుర్తింపు రద్దుచేసి, సూత్రధారులైన ఎమ్మెల్యే, మంత్రులు ఎన్నికల్లో పోటీ చేయకుండా బహిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాజారెడ్డి, హేమకుమార్, రాజమోహన్, సుమన్‌బాబు, రాజేష్‌ఆచారి, వంశీ, చైతన్య పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.31 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.31 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 62,593 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 18,517 మంది తలనీలాలు సమర్పించారు.

ముగిసిన పురందరదాసు ఆరాధన మహోత్సవాలు

తిరుమల, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మూడు రోజుల పాటు జరిగిన పురందరదాసు ఆరాధనా మహోత్సవాలు శనివారం ముగిశాయి. చివరి రోజు ఆస్థాన మండపంలో సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన, హరిదాస రంజని కళాకారులతో సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నుంచి 3,500 మంది భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

మీ డోర్ నంబర్లపై దొంగోట్లు నమోదయ్యాయి.. పరిశీలించుకోండి: టీడీపీ


సమావేశంలో మాట్లాడుతున్న నరసింహయాదవ్, సుగుణమ్మ

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 10: ప్రతి ఇంటి నంబర్‌పైనా దొంగ ఓట్లు నమోదయ్యాయని, వాటిని పరిశీలించుకోవాలని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌ఛార్జి సుగుణమ్మ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ ఇంటి యజమానుల ప్రమేయం లేకుండా అధికార పార్టీ నాయకులు డోర్ నంబర్లపై దొంగ ఓట్లు చేర్చారని తెలిపారు. ఓటరు జాబితాను పరిశీలించుకుని తమ దృష్టికి తీసుకువస్తే తొలగిస్తామన్నారు. ప్రజా తీర్పుతో గెలవాలే కానీ దొంగ ఓట్లు, మద్యం, డబ్బు, రౌడీయిజంతో విజయం సాధించాలనుకోవడం మూర్ఖత్వమవుతుందని విమర్శించారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈ నెల 11 నుంచి చేపట్టనున్న శంఖారావం కార్యక్రమం ద్వారా వైసీపీ అక్రమాలపై ప్రజలను చైతన్యవంతులను చేయనున్నారన్నారు. టీడీపీ, అనుబంధ సంఘాల నేతలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, నాయకులు దంపూరి భాస్కర్, బుల్లెట్ రమణ, శ్రీధర్‌వర్మ, సురా సుధాకర్‌రెడ్డి, ఊట్ల సురేంద్రనాయుడు, మునిశేఖర్‌రాయల్, మహేష్‌యాదవ్, యశ్వంత్‌రెడ్డి, జగన్నాథం, మనోహర్ ఆచారి, విశ్వనాథం, హేమంత్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

బోగస్ ఓట్లకు కేరాఫ్ అడ్రస్ తిరుపతి

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 10: తిరుపతి బోగస్ ఓటరు కార్డుల తయారీ కేంద్రంగా మారడం దురదృష్టకరమని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. మునుపెన్నడూ లేనివిధంగా తిరుపతి కేంద్రంగా 34వేల బోగస్ ఓటరు కార్డులను తయారు చేయడం సిగ్గు చేటన్నారు. చనిపోయిన వారి స్థానంలో బతికున్న వారి ఫొటోలను చేర్చడం, ప్రతిపక్షాల సానుభూతిపరుల ఓటర్లను తొలగించడం దుర్మార్గపు చర్య అన్నారు. తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో దీర్ఘకాలంగా ఉన్న రెవెన్యూ అధికారులను విచారిస్తే మరిన్ని నిజాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. అధికార పార్టీ నేతల ఒత్తిడికి తలొగ్గి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఇలాంటి పనులకు పాల్పడడం దారుణమని, వారు ఆత్మవిమర్శ చేసుకోవాలని కోరారు.

చనిపోయిన వారి పేర్ల తొలగింపు విషయం కలెక్టర్ దృష్టికి..


వ్యాపారులతో మాట్లాడుతున్న సుగుణమ్మ

తిరుమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో చనిపోయిన ఓటర్ల పేర్లను తొలగించే విషయాన్ని కలెక్టర్ లక్ష్మీశా దృష్టికి తీసుకెళతామని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తెలిపారు. శనివారం తిరుమలలోని దుకాణాలు, బాలాజీనగర్‌లో ఆమె స్థానిక నేతలతో కలిసి ఓటర్ల జాబితా పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తుది ఓటరు జాబితాలో 36 మంది చనిపోయిన ఓటర్లతో పాటు మూడు డబుల్ ఎంట్రీలు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్, ఈఆర్వో దృష్టికి తీసుకువెళ్లి తొలగించే ప్రయత్నం చేస్తామన్నారు. తిరుమల స్థానికులకు లైసెన్సులు రెన్యువల్ కాని పక్షంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చేస్తామన్నారు. స్థానిక యువకులు ఉద్యోగాలు అడగ్గా ప్రభుత్వం వచ్చిన తర్వాత చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, బుల్లెట్ రమణ, మునిశేఖర్ రాయల్, తిరుమల నాయకులు రాజుయాదవ్, కేశవులు, భాస్కర్‌వర్మ, బాలాజీ, శివషణ్ముగం, దేవరాజులు, రాఘవ, విశ్వనాథం, ఆనంద్‌బాబు, సుధాకర్ తదితరులు ఉన్నారు.

6, 7, 8 ఫారాలను త్వరగా పరిష్కరించండి

● పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు ఉండాలి
● అధికారులకు కలెక్టర్ లక్ష్మీశా ఆదేశం


వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ లక్ష్మీశా

తిరుచానూరు, ఫిబ్రవరి 10: ఓటర్ల సవరణకు సంబంధించిన 6, 7, 8 ఫారాలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ లక్ష్మీశా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా వీడియో కాన్ఫరెన్సు అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. 6, 7, 8 ఫారాలు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. త్వరితగతిన ఈ-ఓటరు గుర్తింపుకార్డు జనరేట్, ప్రింటింగ్, డెలవరీ ప్రక్రియలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఆర్వోలు, ఏఆర్వోలకు మాస్టర్ ట్రైనింగ్ ఈనెల 13 నుంచి మార్చి 1వ తేదీ వరకు జరుగుతుందని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, నగరపాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్, డీఆర్వో పెంచలకిషోర్, ఈవీఎం నోడల్ అధికారి కోదండరామిరెడ్డి, ఆర్వోలు నిషాంత్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదినికి రూ.10,00,116 విరాళం


ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ రామ్‌కు డీడీని అందజేస్తున్న దాతలు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 10 : స్విమ్స్‌లో నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందించే శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి బెంగళూరులో స్థిరపడిన గుంతకల్‌కు చెందిన రాచూరు వెంకట కిరణ్ ఆయన కుటుంబ సభ్యులు రూ.10,00,116(పది లక్షల నూట పదహార్లు) విరాళంగా అందించారు. ఈ మేరకు దాతలు డీడీని శనివారం స్విమ్స్ డైరెక్టర్ ఛాంబర్‌లో ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ రామ్‌ను కలిసి అందజేశారు. పేదల ఆరోగ్యానికి చేయూతనందించేందుకు ముందుకు వచ్చిన వెంకటకిరణ్, ఆయన కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ వరుణ్‌తేజ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 30,921మంది విద్యార్థులు

● ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటు ● జేసీ శుభం బన్సల్


అధికారులతో మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్

కలెక్టరేట్, ఫిబ్రవరి 10 : మార్చి 18 నుంచి జరగనున్న టెన్త్ పరీక్షలకు జిల్లాలోని 162 కేంద్రాల్లో 30,921మంది హాజరుకానున్నారని జేసీ శుభం బన్సల్ తెలిపారు. ఆ మేరకు పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం పరీక్షల సన్నద్ధతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, 8.45గంటలకే విద్యార్థులు కేంద్రాల వద్దకు చేరుకోవాలని సూచించారు. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఓపెన్ స్కూల్, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈవో శేఖర్, డిప్యూటీ ఈవో, డీఎంహెచ్‌వో శ్రీహరి, డీపీవో రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌ఐఓ ప్రభాకర్‌రెడ్డి, తిరుచానూరు ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రణాళికను ఆచరిస్తే విజేతలు మీరే..!

● నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పొంగూరు శరణి


విద్యార్థులతో కలిసి సందడి చేస్తున్న శరణి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 10: విద్యార్థి దశ నుంచి సరైన ప్రణాళికను ఆచరిస్తే రేపటి విజేతలు మీరే కాగలరని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పొంగూరు శరణి పేర్కొన్నారు. తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో తిరుపతి జోన్‌లోని నారాయణ గ్రూప్ విద్యాసంస్థల్లో పదవ తరగతి చదివే విద్యార్థులకు సఫల్తాకా రాస్తా(రోడ్ టు సక్సెస్)పేరిట శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆమె మాట్లాడారు. విద్యార్థుల్లో అకడమిక్ ఎక్సలెన్స్, సమగ్రాభివృద్ధిని పెంపొందించేందుకు సఫల్తాకా రాస్తా స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు. విద్యాపరమైన విషయాలకు సంబంధించి గుణాత్మక నిర్ణయాలు తీసుకునేందుకు దిశానిర్దేశం చేసిందని వివరించారు. కాగా అంతకుముందు విద్యార్థులతో కలసి ఆమె సందడి చేసి, ఉత్తేజపరిచారు. డీజీఎం కొండలరావు, ఏజీఎం కిశోర్, ఫణికుమార్, ఆర్‌అండ్‌డీ హెడ్ రాజేష్, కోఆర్డినేటర్లు, ఆర్‌ఐలు, ప్రిన్సిపాల్స్, ఇన్‌చార్జులు, ఏవోలు పాల్గొన్నారు.

మోసగాడి అరెస్టు

రూ.2లక్షల బంగారం స్వాధీనం


నిందితుడిని మీడియాకు చూపిస్తున్న సీఐ విశ్వనాథరెడ్డి

చిత్తూరు, ఫిబ్రవరి 10: ఒంటరి మహిళలు, వృద్ధులకు మాయమాటలు చెప్పి వారి వద్ద నుంచి బంగారాన్ని దోచుకెళ్లిన ఓ వ్యక్తిని ఒకటవ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఎస్‌ఐ షేక్షావలితో కలిసి సీఐ విశ్వనాథరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తిరుపతికి చెందిన మహేష్(35) చిత్తూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ ఒంటరి మహిళలు, వృద్ధులకు పెన్షన్ ఇప్పిస్తానని నమ్మబలికేవాడు అని చెప్పారు. పెన్షన్ కోసం ఫొటోలు తీయాలని స్టూడియోకు తీసుకెళ్లి కమ్మలు, ఇతర బంగారు నగలు వేసుకుంటే పెన్షన్ రాదని చెప్పేవాడు. నగలను తీసిస్తే పట్టుకుంటానని చెప్పి, వారు లోపలికి వెళ్లిన వెంటనే నగలతో ఉడాయించేవాడు. దీనిపై చిత్తూరు ఒకటవ, రెండవ పట్టణ పోలీసుస్టేషన్ల పరిధిలో రెండేసి చొప్పున కేసులు నమోదయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిందితుడు మహేష్‌ను పట్టుకుని అతడి వద్ద నుంచి రూ.2 లక్షల విలువ చేసే 25 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

అరాచక పాలనకు చరమగీతం పాడండి



కరపత్రాలను అందజేస్తున్న పాశం సంధ్యారాణి

గూడూరు, ఫిబ్రవరి 10: రాష్ట్రంలో వైసీపీ సాగిస్తున్న అరాచక పాలనకు రానున్న ఎన్నికల్లో ప్రజలు చరమగీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. శనివారం స్థానిక సనత్‌నగర్, నరసయ్యగుంట ప్రాంతాలలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మద్యపాన నిషేధాన్ని అమలుచేస్తానని హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. మహిళలపై దౌర్జన్యాలు, దాడులు పెరిగిపోయాయన్నారు. రాష్ట్రం తిరిగి అభివృద్ధి సాధించాలంటే చంద్రబాబునాయుడు సీఎం కావాలన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, నరసింహులునాయుడు, చంద్రమౌళి, మోహన్, శ్రీధర్, గురవయ్య, భాస్కర్, నారాయణ, వెంకటేశ్వర్లు, సాయి, జనార్దనరెడ్డి, గాయం రమణయ్య, అమరయ్య, భారతి, కల్పన, ఔరంగ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మెడలు వంచైనా గంగ నీటిని విడుదల చేయిస్తా: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

వెంకటగిరి, ఫిబ్రవరి 10: ప్రభుత్వం మెడలు వంచైనా తెలుగుగంగ నీటిని విడుదల చేయించి, రైతులకు సాగునీటి కష్టాలు తీరుస్తానని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత టీడీపీ హయాంలో కండలేరు నీటి మట్టం డెడ్ స్టోరేజ్‌కు చేరుకొన్నా యంత్రాలతో పంపింగ్ చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించి రైతులను ఆదుకొన్నట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం కండలేరులో 12 టీఎంసీల వరకు ఉన్నా రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతులకు ముందే చెప్పకుండా పంటలు సాగుచేశాక నీరు ఇవ్వలేమంటే ఎలా అని కురుగొండ్ల ప్రశ్నించారు. నీటిని విడుదల చేయకపోతే కండలేరు డ్యాంవద్ద నిరాహార దీక్షకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు తోట కృష్ణయ్య, టీడీపీ నాయకులు కేవీకే ప్రసాద్ నాయుడు, పప్పు చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, కాపా శ్రీనివాసులు నాయుడు, పచ్చిగళ్ల రత్నం, తాండవ చంద్రారెడ్డి, నరసింహులు, వెంకటేశ్వర్లు నాయుడు, సుధ తదితరులు పాల్గొన్నారు.

ఆల్తూరుపాడును ఎందుకు పూర్తి చేయలేదు?

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 10: టీడీపీ హయాంలో ప్రారంభించిన ఆల్తూరుపాడు రిజర్వాయర్‌ను ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కరువు, చంద్రబాబు నాయుడు కవల పిల్లలన్నారు. టీడీపీ అధికారంలో ఉంటే పంటపొలాలన్నీ బీడుగా మారుతాయన్నారు. వైసీపీ ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. రైతులకు తెలుగుగంగ నీరు వస్తున్నాయని, రైతులు అవసరాన్ని బట్టి వాడుకోవాలని కోరారు. మున్సిపాలిటీలోని ప్రభుత్వ భూములపై నివేదిక వేసి పర్యవేక్షిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నగరిలో నేడు పీసీసీ అధ్యక్షురాలి పర్యటన

భారీ ఏర్పాట్లు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నగరి, ఫిబ్రవరి 10: నగరి పట్టణ పరిధిలో ఆదివారం పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పర్యటించనున్నారు. దీంతో కాంగ్రెస్ నాయకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ఓంశక్తి దేవాలయం నుంచి నగరి టవర్‌క్లాక్ వరకు ర్యాలీగా వెళ్లి, అనంతరం జరిగే బహిరంగ సభలో ఆమె పాల్గొంటారు. ఈ నేపథ్యంలో శనివారం కాంగ్రెస్ నాయకులు జంగా గౌతమ్, రాకేష్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, బాబు, భాస్కర్ చిరంజీవిరెడ్డి తదితరులు బహిరంగ సభాస్థలిని పరిశీలించారు. స్థానిక నాయకులకు పలు సూచనలిచ్చారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

మాజీ సర్పంచు మృతి



దయాకర్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

కోట, ఫిబ్రవరి 10: కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం మాజీ సర్పంచు పెనుబోలు దయాకర్‌రెడ్డి(78) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. గత కొంత కాలంగా గుండె సంబంధించి వ్యాధితో బాధపడుతున్న ఆయన శనివారం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందారు. దయాకర్‌రెడ్డి నెల్లూరుపల్లి కొత్తపాళెం సర్పంచుగా, సింగిల్ విండో ఛైర్మన్‌గా, జలసంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. గతంలో టీడీపీలో ఉన్న ఆయన కొంతకాలం క్రితం వైసీపీలో చేరారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 10: పట్టణంలో ఓ మహిళను ఆన్‌లైన్‌లో రూ.10 లక్షలు మోసం చేసిన సంఘటనపై శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆన్‌లైన్‌లో బంగారం విక్రయిస్తానంటూ ఓ వ్యక్తి నాయుడుపేట పట్టణానికి చెందిన మహిళ నుంచి విడతల వారీగా రూ.10 లక్షలు అకౌంట్‌లో జమ చేయించుకున్నాడు. ఆ తరువాత అతని నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో బాధితురాలు నాయుడుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

చెంగాళమ్మ ఆలయ ఈవోగా వెంకటేశ్వర్లు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 10: చెంగాళమ్మ ఆలయ ఈవోగా దోబగుంట వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఉన్న ఈవో శ్రీనివాసరెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నెల్లూరు రంగనాయకుల స్వామి ఆలయ ఈవోగా ఉన్న వెంకటేశ్వర్లును నియమించారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 10: వెంకటగిరి - నాయుడుపేట మార్గంలో తెలుగుగంగ కాలువ వద్ద శనివారం ఓ కారు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. 9వ బెటాలియన్‌లో పనిచేస్తున్న ప్రసన్న కుమార్ నాయుడుపేటకు వెళ్తుండగా తెలుగుగంగ కాలువ దాటిన తరువాత రోడ్డుపై కుక్క అడ్డుగా వచ్చింది. దానిని తప్పించబోయే క్రమంలో కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తడ, ఫిబ్రవరి 10: మండల పరిధిలోని రామాపురం, పెరియవట్టు పంచాయతీలలో పోలింగ్ కేంద్రాలను సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని పరిశీలించారు. శనివారం తడకు వచ్చిన ఆయన ఆయా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, ఇతర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును ఎటువంటి ఇబ్బందులు లేకుండా వినియోగించుకునేలా ఏర్పాట్లు చేసుకున్నామని ఆర్డీవో తెలిపారు.

అమ్మవారికి హారం విరాళం



ఆలయ అధికారులకు హారాన్ని అందజేస్తున్న అశ్విన్

తిరుచానూరు, ఫిబ్రవరి 10: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారికి శనివారం హైదరాబాద్‌కు చెందిన అశ్విన్ రూ.9.22లక్షలు విలువైన 120 గ్రాముల బంగారు లక్ష్మీకాసుల హారాన్ని కానుకగా అందజేశారు. ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్‌కు హారాన్ని అందజేశారు. అనంతరం అశ్విన్ కుటుంబ సభ్యులు కుంకుమార్చన సేవలో పాల్గొన్నారు. సూపరింటెండెంట్ శేషగిరి, అర్చకులు బాబుస్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా పద్మావతి అమ్మవారిని దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శనివారం రాత్రి దర్శించుకున్నారు.

టీటీడీ డిప్యూటీ ఈవోగా హరికృష్ణ


తిరుపతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): టీటీడీ డిప్యూటీ ఈవోగా తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ వైస్ ఛైర్మన్ హరికృష్ణను నియమిస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటేషన్‌పై ఏడాది పాటు ఆయన ఈ హోదాలో కొనసాగనున్నారు. ఇప్పటికే ఖాళీగా ఉన్న డిప్యూటీ ఈవో స్థానంలో ఆయనను భర్తీ చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, తుడ వైస్ ఛైర్మన్ కన్నా టీటీడీ డిప్యూటీ ఈవో బాధ్యత పెద్దదేమీ కాదు. కన్ఫర్డ్ ఐఏఎస్‌కు దగ్గర్లో ఉన్న వీసీని టీటీడీ డిప్యూటీ ఈవోగా నియమించడం గమనార్హం.

తుది జాబితా కూడా తప్పుల కుప్పే


- మృతుల ఓట్లు భద్రం.. బతికున్నవారి పేర్లు మాయం
- భారీగా డబుల్ ఎంట్రీలు

గూడూరు, ఫిబ్రవరి 10: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ల జాబితాలో తప్పొప్పులను సవరించి అధికారులు విడుదల చేసిన తుది జాబితాలోనూ తప్పిదాలు వెలుగు చూస్తున్నాయి. ప్రధానంగా మృతి చెందినవారి ఓట్లు, డబుల్ ఎంట్రీలను తొలగించకపోవడంతో పాటు ఒక బూత్‌లోని ఓటర్లను మరో బూత్‌లో చేర్చడం వంటి తప్పులు అలాగే ఉన్నాయి. ఉదాహరణకు.... గూడూరు పట్టణంలోని 33వ బూత్ ఓటర్ల జాబితా సీరియల్ నంబరు 681లో మసీదువీధికి చెందిన దిల్షాద్ షేక్ అనే మహిళ ఓటు ఉండగా, 35వ బూత్‌లో సీరియల్ నంబరు 73లోనూ ఆమె పేరుమీద మరో ఓటు ఉంది. అదేవిధంగా 33వ బూత్‌లో సీరియల్ నంబరు 676లో మసీదువీధికి చెందిన వహీదా షేక్ అనే మహిళ ఓటు ఉండగా, 35వ బూత్ సీరియల్ నంబరు 67లో ఇదే పేరుతో ఓటుంది. 33వ బూత్‌లో సీరియల్ నంబరు 635లో మసీదువీధికి చెందిన మహ్మద్‌బాషానీ నాలుగు నెలల క్రితం మృతి చెందినా అతని ఓటు తొలగించలేదు. 35 బూత్‌లో సీరియల్ నంబరు 64లో మసీదువీధికి చెందిన ఫిరోజ్‌ఆహ్మద్ మూడేళ్ల క్రితం మృతిచెందారు. అయినా అతని ఓటు తొలగించలేదు. 33వ బూత్‌లో సుమారు 8మంది మృతుల ఓట్లు, 10 డబుల్ ఎంట్రీలు, 35వ బూత్‌లో ఐదుగురు మృతుల ఓట్లు, 12 డబుల్ ఎంట్రీలు ఉన్నాయి. ముసాయిదా ఓటర్ల జాబితాలోనే ఇవన్నీ గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తొలగించలేదని టీడీపీ నాయకులు, బీఎల్ఏలు ఆరోపిస్తున్నారు.

నాయుడుపేట: పట్టణంలోని మంగపతి నాయుడు నగర్, డోర్ నెంబరు 7-7-82లో కొండూరు రాఘవరాజు నివాసం ఉంటున్నారు. ఆయన బతికే ఉన్నా ఓటు తొలగించారు. డోర్ నెంబరు 7-7-74లో ఉండే వేమసాని సుందరరామ నాయుడు మృతి చెందినా ఆయనకు బూత్ నెంబరు 70 సీరియల్ 714లో ఓటు ఉంది. అలాగే డి.రాజగోపాలపురంలో డోర్ నెంబరు 3-1-192లో ఉండే ఉక్కా శివ శంకర్, డోర్ నెంబరు 3-1-225లో ఉండే యల్లశిరి జయచంద్రారెడ్డి మృతిచెందినా వారి పేర్లను తొలగించలేదు.



నాయుడుపేటకు చెందిన కొండూరు రాఘవరాజు బతికున్నా జాబితా నుంచి తొలగించిన దృశ్యం



ఉక్కా శివశంకర్ మృతిచెందినా అలాగే ఉన్న పేరు



గూడూరు పట్టణంలోని 33, 35 బూత్‌లలో ఉన్న మహిళలకు డబుల్‌ఎంట్రీలు

అధిక ధరకు మద్యం విక్రయం

- ఎస్ఈబీ అధికారులు కొట్టారంటూ పెట్రోలు పోసుకున్న సూపర్‌వైజర్



ఎస్ఈబీ స్టేషన్ వద్ద మద్యం దుకాణాల సిబ్బంది



గౌతం, చరణ్‌కుమార్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 10: తిరుపతిలోని ఓ మద్యం దుకాణంలో సిబ్బంది అధిక ధరకు మద్యాన్ని విక్రయిస్తుండటాన్ని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. సదరు సేల్స్‌మాన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. చిత్తూరు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) ఆధ్వర్యంలోని విజిలెన్స్ అధికారులు శనివారం నగరంలోని పలు మద్యం దుకాణాల్లో రహస్య తనిఖీలు చేపట్టారు. అన్నమయ్య కూడలిలోని మద్యం దుకాణం నం 10025లో మద్యాన్ని కొనుగోలు చేశారు. సేల్స్‌మాన్ గౌతం బాటిల్‌పై 10 రూపాయలు అదనంగా వసూలు చేశారు. దీంతో ఎక్సైజ్ విజిలెన్స్ అధికారులు అతన్ని అదుపులోకి తీసుకుని తిరుపతి అర్బన్ ఎస్ఈబీ స్టేషన్‌కు తరలించి కేసు నమోదుకు సిఫారసు చేశారు. ఈలోపు అతనికి మద్దతుగా పలు మద్యం దుకాణాల సిబ్బంది ఎస్ఈబీ స్టేషన్‌కు చేరుకున్నారు. ఎస్ఈబీ సిబ్బంది అతనిపై చేయి చేసుకుందని, కేసు నమోదు చేయకుండా వదిలేయాలని అర్బన్ ఎస్ఈబీ సీఐ సుబ్బారెడ్డిని కోరారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు విషయం కొలిక్కి రాకపోవడంతో దుకాణ సూపర్‌వైజర్ జి.చరణ్‌కుమార్ ఒంటిపై పెట్రోలు పోసుకున్నారు. గౌతంపై కేసు నమోదు చేసినా, అతని ఉద్యోగానికి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐ సుబ్బారెడ్డి వారితో చర్చించి, ఉద్యోగానికి భరోసా ఇవ్వడంతో గౌతం, చరణ్‌కుమార్‌తో కలిసి సిబ్బంది వెనుదిరిగారు. కాగా, మద్యం దుకాణాల్లో తనిఖీ చేసి, సిబ్బందిని అదుపులోకి తీసుకునే అధికారం తమకు లేదని ఎస్ఈబీ సీఐ సుబ్బారెడ్డి ఆంధ్రజ్యోతికి చెప్పారు. ఏసీ విజిలెన్స్ బృందం తనిఖీలు చేసి గౌతంను తమ స్టేషన్‌కు తీసుకొచ్చారని, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసే బాధ్యత తమదేనని అన్నారు. నిందితుడిని తాము కొట్టామని చెప్పడం అబద్ధమని అన్నారు.

బ్లాక్‌లో మద్యం విక్రయిస్తున్న వాచ్‌మెన్‌పై కేసు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 10: బ్లాక్‌లో మద్యం విక్రయిస్తున్న చెర్లోపల్లి ప్రభుత్వ మద్యం దుకాణ వాచ్‌మెన్‌పై తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం... పుదిపట్లకు చెందిన టి.గోవిందు చెర్లోపల్లి మద్యం దుకాణం వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. దుకాణం నుంచి మద్యం బాటిళ్లను ఎమ్మార్పీకి కొనుగోలుచేసి, అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకోవడం ప్రారంభించాడు. రాత్రి 10గంటల నుంచి ఉదయం వరకు మద్యాన్ని బ్లాక్‌లో విక్రయిస్తుండేవాడు. తిరుపతి రూరల్ పోలీసులు మద్యం దుకాణం వద్దకు చేరుకుని అతన్ని తనిఖీ చేసి, ఏడు మద్యం బాటిళ్లను గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ మూడువేల రూపాయలు ఉంటుందని ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపారు.

మరో అయోధ్యలా పేటమిట్ట

- తీర్చిదిద్దుతామన్న గల్లా రామచంద్ర నాయుడు



పూతలపట్టు, ఫిబ్రవరి 10: 'కోట్లు సంపాదించినా.. జన్మనిచ్చిన ఊరిని మరువరాదు. సొంతూరికి ఏం చేశామన్న ఆలోచన అందరిలోనూ రావాలి. నా స్వగ్రామం పేటమిట్టను మరో అయోధ్యలా తీర్చిదిద్దడమే ధ్యేయం' అని అమరరాజా గ్రూపు సంస్థల వ్యవస్థాపకుడు గల్లా రామచంద్ర నాయుడు అన్నారు. శనివారం ఆయన పూతలపట్టు మండలం పేటమిట్టలో నిర్మిస్తున్న రామాలయ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. సంప్రదాయాలను పునరుద్ధరించడమేగాక ప్రజలంతా కలసిమెలసి ఉండాలన్న ఉద్దేశంతో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఆయన మాటల్లోనే.. 'గ్రామస్థుల సహకారంతో 97 సెంట్ల భూమిని కొనుగోలు చేసి ఇక్కడ తొలుత విరూపాక్షమ్మ గుడిని నిర్మించాం. 2019 జనవరి 20వ తేదీన సొంత నిధులతో పాటు భక్తులు అందజేసిన విరాళాలతో సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి కొలువై ఉండేలా ప్రధాన ఆలయాన్ని నిర్మిస్తున్నాం. దీనికి ఓవైపు కృష్ణ మందిరం, మరోవైపు విఘ్నేశ్వర ఆలయం ఉంటాయి. గ్రామమంతా ప్రతిధ్వనించేలా భారీ గంటలు ఏర్పాటు చేస్తున్నాం. ఆలయ సముదాయంలో సమావేశాల నిర్వహణకు మినీ ఓపెన్ ఆడిటోరియం, సామూహిక కార్యక్రమాల కోసం కమ్యూనిటీ హాలు, చిన్నపిల్లల కోసం పార్కు ఉంటాయి' అని రామచంద్ర నాయుడు వివరించారు. ఇక ఆలయ పరిసరాల గుండా ప్రవహించే తేనేపల్లి చెరువు కాలువపై 160 మీటర్ల పొడవున కల్వర్టును నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. దీన్ని అమరరాజా గ్రూపు సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల నుంచి రూ.3.75 కోట్ల వ్యయంతో నిర్మించారని తెలిపారు.

రేపటినుంచి కుంభాభిషేక మహోత్సవాలు

కోదండరామస్వామి ఆలయ సముదాయానికి సోమవారం నుంచి నాలుగు రోజులపాటు కుంభాభిషేక మహోత్సవాలు జరుగుతాయని రామచంద్ర నాయుడు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అమరరాజా సంస్థలు పక్క రాష్ట్రాలకు వెళ్లడంపై, కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చిన నోటీసులపై మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. ఎటువంటి నోటీసులు ఇచ్చినా, తాము ఏ తప్పూ చేయలేదనే దృక్పథంతో ధైర్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు.ఏ పార్టీ అధికారంలో ఉన్నా తమ సంస్థలకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. తమ సంస్థల ఏర్పాటుతో పేటమిట్టకు ఇప్పటికే ప్రపంచంలోనే గుర్తింపు వచ్చిందన్నారు.సర్పంచ్ గల్లా రాధాకృష్ణ , పారిశ్రామికవేత్త గల్లా రాజశేఖర్ , పీఆర్వో లు బాబ్జీ, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

గంగజలాలు తీసుకురావడంలో వైసీపీ విఫలం: టీడీపీ

వాకాడు, ఫిబ్రవరి 10: తెలుగుగంగ జలాలను తీసుకురావడంలో వైసీపీ విఫలమైందని తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి కుంచం దయాకర్ విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 18వేల ఎకరాలకు పైగా రైతులు వరి సాగు చేపట్టారని, వివిధ దశల్లో ఉన్న పంటకు నీరందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇరిగేషన్ డీఈ సుబ్బారావును వివరణ కోరగా తెలుగుగంగ కెనాల్‌లో డెడ్ స్టోరేజ్ 3 టీఎంసీలు మాత్రమే ఉందన్నారు. గంగజలాలను సాగుకు విడుదల చేస్తే రానున్న రోజుల్లో తాగునీటికి ఇబ్బందులు పడుతామని చెప్పారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఆక్రమిత భూముల్లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

వడమాలపేట, ఫిబ్రవరి 10: మండల పరిధిలోని బంగారెడ్డి కండ్రిగ సమీపంలో ప్రభుత్వ గుంట పరంబోకు భూముల్లో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు శనివారం తొలగించారు. ఆ భూముల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. గుంట పరంబోకు భూములను చదును చేస్తున్నారు... పేరుతో ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు సీతారాపురం రెవెన్యూ పరిధిలోని బంగా రెడ్డి కండ్రిగ సమీపంలో ఆక్రమిత భూములను శనివారం పరిశీలించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడితే సహించేది లేదని, చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆక్రమిత భూములు ప్రభుత్వానివని, ఎవరైన ఆక్రమణలకు పాల్పడితే తెలియజేయాలని స్థానిక ఎస్టీ కాలనీవాసులను కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్ రఘువర్మ, వీఆర్వోలు నాగరాజు, నరేష్, చంద్రబాబు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రానికి చాపల వితరణ

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 10: పట్టణంలోని వినాయకపురం ఎస్టీ కాలనీ అంగన్వాడీ కేంద్రానికి టీడీపీ ఎస్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు హేమాద్రి శనివారం చాపలను వితరణగా అందించారు. టీడీపీ నాయకులు జానకీరామయ్య, కుసలకుమార్, చెంచయ్య పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట, ఫిబ్రవరి 10: అప్పలాయగుంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేద మంత్రాలు, భక్తులు గోవింద నామ స్మరణల నడుమ శ్రీవారి ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారిని మేళతాలలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారికి మంగళహారుతలిచ్చారు.

సచివాలయ భవనం ప్రారంభం



పుత్తూరు, ఫిబ్రవరి 10: పుత్తూరు మండలంలోని ఉత్తరపుకండ్రిగలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని మంత్రి రోజా శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, సుదర్శనం, సర్పంచు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కాళ్లు పట్టుకునే సంస్కృతి వైసీపీదే: ఐటీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న ఐటీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 10: కాళ్లు పట్టుకునే సంస్కృతి వైసీపీదేనని ఐటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాలి గోపీనాథ్ అన్నారు. శనివారం పట్టణంలోని జీజీఎన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కాళ్లు పట్టుకున్నారని వైసీపీ పేటీఎం బ్యాచ్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉన్న రోజా ఆన్ రికార్డు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఏది నకిలీ, ఏది నిజమైనది అనే విషయం మంత్రి కూడా గుర్తించకపోవడం ఆమె అజ్ఞానానికి నిదర్శనమన్నారు. కేంద్రం మెడలు వంచైనా ప్రత్యేక హోదా సాధిస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఊదరగొట్టిన జగన్, రోజా అధికారంలోకి వచ్చిన తరువాత తిరుపతి ఎయిర్‌పోర్టులో ప్రధాని నరేంద్రమోదీ కాళ్లపై మోకరిల్లడం అందరికీ గుర్తుందని దెబ్బిపొడిచారు. కేంద్రం మెడలు కాదు కదా ఏకంగా వాళ్ల కాళ్ల వద్ద నడుములు వంచే దుస్థితికి సీఎం జగన్, వైసీపీ నాయకులు దిగజారారని విమర్శలు గుప్పించారు. జగన్ దృష్టిలో పడి మళ్లీ టికెట్ తెచ్చుకోవాలనే ప్రయత్నంలో భాగంగానే చంద్రబాబునాయుడిపై లేనిపోని ఆరోపణలు చేస్తూ మంత్రి రోజా ప్రజల్లో పలుచనైపోయారని అన్నారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఈ దఫా నగరి ప్రజలు స్పష్టమైన తీర్పు ఇవ్వనున్నారని, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో ఐటీడీపీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, ఈశ్వర్‌యాదవ్, కృష్ణన్, తులసిలింగం, శాఖమూరి మహేష్, బుజ్జిబాబు, ఇళంగోవన్ పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై వీరరాఘవస్వామి



నారాయణవనం, ఫిబ్రవరి 10: మండల కేంద్రంలోని కనకవల్లీ, వేదవల్లీ సమేత వీరరాఘవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు హనుమంత వాహనంపై ఊరేగితూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారిని నిత్యపూజా కైంకర్యాలతో మేల్కొలిపి, ప్రత్యేక అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణలో స్వామివారు హనుమంతు వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం భక్తి శ్రద్ధలతో ప్రధాన అర్చకులు చేతుల మీదుగా చక్రస్నానం చేయించారు.

టీడీపీ కార్యర్తలకు నివాళి



వడమాలపేట, ఫిబ్రవరి 10: మండలంలోని టీసీ అగ్రహారం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు సుబ్రహ్మణ్యం రెడ్డి, సుబ్బారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ టీసీ అగ్రహారం గ్రామానికి చేరుకుని వారి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంసభ్యులను పరామర్శించారు. టీడీపీ వారిలో రవిరెడ్డి, వెంకటరమణ, దాము, బాలరామిరెడ్డి, ధనంజయులు నాయుడు, పెద్దబ్బ రాజు తదితరులు ఉన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం



వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10: శ్రీకాళహస్తిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు జరిగే జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్ వైజ్ఞానిక ప్రదర్శన శనివారం ప్రారంభమైంది. జిల్లా నలుమూలల నుంచి ఎంపికైన విద్యార్థులు తమ ఆవిష్కరణలు ప్రదర్శించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, జేసీ శుభం బన్సల్, డీఈఓ డాక్టర్ శేఖర్ విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టెక్నాలజీని ఎప్పటికప్పుడు మెరుగ పరుచుకోవాలని కోరారు. జేసీ మాట్లాడుతూ శాస్త్రవేత్తల మేధస్సుపైనే మానవ జీవన గమనం ఆధారపడి ఉంటుందన్నారు. డీఈవో మాట్లాడుతూ ఒక సృజనాత్మక ఆలోచన ప్రపంచాన్ని మార్చగలదని చెప్పారు. విద్యార్థులు రూపొందించిన పలు ఆవిష్కరణలను ఆసక్తిగా తిలకించారు. ఆలోచింపజేసిన ప్రయోగాల ఉద్దేశాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్, సీఎం ఓ సురేష్, ఎంఈఓ లు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఢిల్లీ నుంచి విచ్చేసిన ఎన్ఐఎం పరిశీలకు డాక్టర్ మహ్మద్ రయిజ్, దివ్యాన్స్ ఇన్స్పైర్ కమిటీ సభ్యులు, జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తొట్టంబేడు, ఫిబ్రవరి 10: ప్రజలంతా కలిసికట్టుగా బాల్య వివాహాలను నిర్మూలిద్దామని ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యా యుడు లక్ష్మీ పతి పిలుపునిచ్చారు. మండలంలోని చియ్యవరం గ్రామంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీని బలపరచండి

ఏర్పేడు, ఫిబ్రవరి 10: వచ్చే ఎన్నికల్లో కోలా ఆనంద్‌ను బల పరిచి గెలిపించాలని ఏర్పే డులో బీజేపీ నాయ కులు శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో బీజేపీ నాయ కులు ఎస్వీ రమణ, ఈగల బాలాజీ రాయల్, దాముర‌ాయల్, ప్రతాప్, మోహన్‌రావు, ప్రతాప్, నీల, వెంకటేశు, అయ్యప్ప, నాగరాజు పాల్గొన్నారు.

'పల్లెకుపోదాం' క్యాలెండర్ల పంపిణీ

పిచ్చాటూరు, ఫిబ్రవరి 10: పల్లెకుపోదాం అనే కార్య క్రమం క్యాలెండర్లను బీజేపీ జిల్లా కార్యదర్శి సత్య నారాయణరెడ్డి శని వారం ఆ పార్టీ కో-కన్వీనర్ హెన్రీకి అందజేశారు. అనంతరం ఆ పార్టీ నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో క్యాలెండర్లను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీని ప్రతిపల్లెకు విస్తరింపజేసేందుకు నాయకులు విస్తృతంగా పర్యటించాలని కోరారు.

ఎస్టీయూ కార్యవర్గం ఏర్పాటు



అధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ

కేవీబీపురం, ఫిబ్రవరి10: ఎస్టీయూ మండల నూతన సంఘం ఎన్నిక శనివారం మండల కేంద్రంలో జరిగింది. డివిజినల్ కన్వీనర్ మురళి అధ్వ ర్యంలో సీపీఐ ఏరియా కార్యదర్శి గురవయ్య పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వ హించారు. కమిటీ అధ్యక్షులుగా శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా బాలాజీ, ఆర్థిక కార్యదర్శిగా మధుసూదన్, జిల్లా కార్యదర్శులుగా చంద్రశేఖర్, శ్రీహరిలను ఎన్నుకున్నారు.

ఉమ్మడి అభ్యర్థిని గెలిపించండి



ఏర్పేడు, ఫిబ్రవరి 10: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన- టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని ప్రజలు గెలిపించాలని జనసేన శ్రీకాళ హస్తి నియోజక వర్గ ఇన్‌చార్జి కోట వినుత కోరారు.ఏర్పేడు మండలం మేర్లపాకలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమల కాలుష్యంతో ఇబ్బంది పడుతు న్నామని కాలువలు, వీధి దీపాలు లేవని స్థానికులు ఆమె దృష్టికి తీసుకు వచ్చారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కిరణ్‌కుమార్, నితీష్‌కుమార్, వంశీ, వెంకట రమణ, సురేంద్ర, క్రాంతి, దండి రాఘవయ్య, శివకుమార్, తోట గణేష్, జ్యోతిరామ్, లక్ష్మి, రాజ్యలక్ష్మి, కవిత, శారద, చిరంజీవి పాల్గొన్నారు.

బీజేపీని ఆశీర్వదించండి

తొట్టం బేడు, ఫిబ్రవరి 10: కేంద్రంలో మరోసారి, రాష్ట్రంలో ఒక్కసారి బీజేపీని ఆదరిం చాలని ఆ పార్టీ తొట్టంబేడు మండల అధ్యక్షుడు వెదెం కృష్ణయ్య కోరారు. మండలంలోని చియ్యవరం పంచాయతీలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు వెంకటేష్, గురప్ప, రాజనాల తదితరులు పాల్గొన్నారు.

చెప్పుల వ్యాపారిపై దాడి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10: చెప్పుల వ్యాపారిపై కొందరు యువకులు దాడి చేశారు. శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఓ వ్యక్తి చెప్పుల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇంటివద్ద పావురాలను పెంచుతు న్నాడు. మూడు రోజుల క్రితం రాత్రిపూట కొన్ని పావురాలను ఎవరో దొంగిలించారు. ఈక్రమంలో సంతమైదానికి చెందిన కొందరు యువ కులపై అనుమానంతో ప్రశ్నించాడు. కక్ష పెంచుకున్న యువకులు శని వారం రాత్రి అతడి దుకాణంలో చొరబడి దాడి చేశారు. వ్యాపారి ప్రైవేట్ వైశాలలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

వేలం సొమ్ము చెల్లించకనే
దుకాణాల స్వాధీనం

- ఏడాదిగా పంచాయతీ ఆదాయానికి గండి
- మళ్లీ వచ్చే నెలలో వేలం

ఏర్పేడు, ఫిబ్రవరి 10: ఎక్కడైనా వేలం పాట నిర్వహిస్తే పాడుకున్న మొత్తాన్ని పాటదారుడు చెల్లించాలి. ఆ తర్వాతే షాపులు పాటదారుడికి అప్పగిస్తారు. అయితే ఇక్కడ మాత్రం పాడుకున్న మొత్తం చెల్లించకనే అప్పగించేశారు. ఏర్పేడు మండలం ఆమందూరు పంచాయతీలో గత ప్రభుత్వ హయాంలో ఓ షాపింగ్ కాంప్లెక్సు నిర్మించారు. ఇందులో ఎనిమిది గదులు ఉన్నాయి. ఈ గదులకు ప్రతి ఏటా వేలం పాట నిర్వహిస్తారు. గత ఏడాది ఆమందూరు పంచాయతీ సర్పంచ్ అయిన టీడీపీ మండల యువత అధ్యక్షులు గుణయాదవ్ లేకుండా వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఎనిమిది గదులను రూ.7.30లక్షలకు దక్కించుకున్నారు. దుకాణాలు స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారులు సైతం నిర్వహించు కుంటున్నారు. అయితే ఏడాది గడిచిపోతున్నా వేలంలో పాడుకున్న మొత్తం ఇప్పటివరకు పంచాయతీకి చెల్లించలేదు.

వచ్చే నెలలో మళ్లీ వేలం

మళ్లీ మార్చి మొదటి వారం అదే గదులకు వేలం నిర్వహించాల్సి ఉంది. దీంతో ఈలోగానైనా గత ఏడాది సొమ్ము చెల్లిస్తారో లేక.. ఈసారి కూడా వేలం సొమ్ము కట్టకుండా పంచాయతీకి టోపీ వేస్తారో తెలియడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

శనీశ్వర స్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వరస్వామికి విశేష పూజలు జరిగాయి. శనివారం పురస్కరించుకుని ముందుగా అర్చకులు శనీశ్వరస్వామి సన్నిధిని శుద్ధి చేశారు. భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ పూజా ద్రవ్యాలతో పాటు శని ప్రీతి కోసం విశేషంగా తైలాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి ధూపదీప నైవేద్యాలు సమ ర్పించి విశేషాలంకారంతో దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉమ్మడి ప్రభుత్వం రావాలని శనేశ్వరుడికి పూజలు



తిరునల్లార్ శనీశ్వరాలయం వద్ద ఎస్సీవీ నాయుడు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10: వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలని శనేశ్వరస్వామిని ప్రార్థించినట్లు మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు తెలియజేశారు. శనివారం ఆయన పుదుచ్చేరిలోని తిరునల్లార్ శనేశ్వర స్వామిని ఆలయాన్ని దర్శించారు. అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్ర ద్వారా ఇచ్చిన హామీలు త్వరలో నెరవేరాలని పూజలు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయన తనయుడు దిలీప్, జయరాం రెడ్డి, భాస్కర్ నాయుడు, రాజా శర్మ, రమేష్ శర్మ, శివానంద శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కు పంపిణీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10: శ్రీకాళహస్తి పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం ఆసరా నాలుగో విడత పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి డ్వాక్రా మహిళలకు చెక్కును ప్రారంభించారు. పొదుపు సంఘాల మహిళలు స్టాల్స్ ప్రదర్శించారు. రమేష్‌బాబు, ఆత్మ అధికారులు ప్రసాద్ అమ్మాజీ, ముంతాజ్ బేగం పాల్గొన్నారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

తొట్టంబేడు, ఫిబ్రవరి 10: శ్రీకాళహస్తి మండలంలోని వాగివేడు గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

బీసీలకు పెద్ద పీట వేసింది టీడీపీయే : హెలెన్



సమావేశంలో మాట్లాడుతున్న హెలెన్

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 10: తెలుగుదేశం ప్రభుత్వ హయంలో బీసీలకు పెద్ద పీట వేసిందని, పార్టీ గెలుపు కోసం బీసీలందరు ఏకం కావాల్సిన సమయం వచ్చిందని సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి హెలన్, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే హేమలత పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో టీడీపీ ఆధ్వర్యంలో జయహో బీసీ బహిరంగ సభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ హెలెన్ మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చాక బీసీలకు ఉన్న పథకాలు ఎత్తివేసి వారి సంక్షేమాన్ని విస్మరించారని తెలిపారు. చంద్రబాబు ఆరు గ్యారంటీలతో అన్ని వర్గాలకు మేలు జరు గుతుందన్నారు. నరసింహయాదవ్ మాట్లాడుతూ టీడీపీ పాలనలో బీసీల కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు, కుల వృత్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. మాజీ ఎమ్మెల్యే హేమలత మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై, బీసీలపై దాడులు ఎక్కువయ్యాయని విమర్శించారు. మరో రెండు నెలల్లో ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రానుందని ధీమా వ్యక్తం చేశారు. ఇందుకోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. అంతకు ముందు పెట్రోల్ బంకు నుంచి సభాస్థలి వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ప్రధాన కార్యదర్శులు మునస్వామ యాదవ్, గురవారెడ్డి, దశరథాచారి, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు రుద్రకోట సదానందం, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కన్నయ్యనాయుడు, మేదర కార్పొరేషన్ మాజీ చైర్మన్ సుందరయ్య, నాయకులు వేడాం వెంకటాచలం, శేషయ్య, సుబ్రమణ్యం, వీరరాఘవులు, మునిసుబ్బయ్య, ఉషారాణి, సురేష్ యాదవ్, గంగాధర్, భాస్కర్ యాదవ్, భూపయ్య, మధునాయుడు, మునిరాజా, మునెయ్యనాయుడు, శశియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు తెలపడం కూడా చేతకాదా జగన్ ?



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మాధవులనాయుడు

పిచ్చాటూరు, ఫిబ్రవరి 10: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకి భారతరత్న ఇస్తే అభినందనలు తెలియజేయడం కూడా చేతకాని వ్యక్తి సీఎం కావడం తెలుగు జాతి చేసుకున్న కర్మ అని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు మాధవులనాయుడు పేర్కొన్నారు. శనివారం ఆయన స్వగ్రామమైన గోవర్ధనగిరిలో మీడియాతో మాట్లాడారు. పీవీకి భారత రత్నపై ఢిల్లీలో జాతీయ మీడియా స్పందన కోరితే విజయసాయిరెడ్డి చెబుతారని తప్పించుకోవడం సిగ్గుచేటన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారం చేపట్టబోతోందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృశ్య కేంద్రంతో సఖ్యతగా ఉంటేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. సత్యవేడు విషయంలో అధిష్ఠానం అందరికీ ఆమోద యోగ్యమైన వ్యక్తిని అభ్యర్థిగా ప్రకటిస్తుందని వివరించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ ఇళంగోవన్ రెడ్డి, మాజీ ఎంపీపీ మురళి, నాయకులు సతీష్‌నాయుడు, రవినాయుడు, విజయకుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి వెలసిన వైఎస్ విగ్రహం



ఫ్లైఓవర్ బ్రిడ్జి చివర ఏర్పాటు చేసిన విగ్రహం

రేణిగుంట, ఫిబ్రవరి10: రేణిగుంటలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రారంభంలో డివైడర్ మధ్యలో శుక్రవారం అర్ధరాత్రి వైసీపీ నాయకులు, అభిమానులు వైఎస్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహం ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేశారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.. ప్రధాన రహదారుల్లో విగ్రహాలను ఏర్పాటు చేయాలంటే పంచాయితీరాజ్, పోలీసుశాఖ, రోడ్లు భవనాలశాఖ, కలెక్టర్ నుంచి అనుమతులు ఉండాలి. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా విగ్రహం ఏర్పాటు చేశారని ప్రజలు చర్చించుకుంటున్నారు. రేణిగుంటలో గతంలో మహాత్మాగాంధీ విగ్రహాలు, అనంతరం పూర్తిస్థాయి అనుమతులతో ఎన్టీ రామారావు విగ్రహం ఏర్పాటు చేశారు. ఇప్పుడు అను మతులు లేకుండా ఏర్పాటు చేసినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

పారిశుధ్య కార్మికుడికి నివాళి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10: శ్రీకాళహస్తి పురపాలక సంఘం కార్మికుడు శీనయ్యకు పలువురు ఘనంగా నివాళులర్పించారు. స్వర్ణముఖి నదిలో పడి శీనయ్య మృతిచెందిన విషయం తెలిసిందే. శనివారం సీపీఐ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి జనామాల గురవయ్య, నాయకులు ఏఐటీయూసీ కార్మిక సంఘాల సభ్యులు ఆయన మృతదేహానికి పూలమాలవేసి సంతాపం తెలిపారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10: వచ్చే నెల 9వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని న్యాయ స్థాన భవనంలో న్యాయమూర్తులు లోక్ అదాలత్‌పై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ మూర్తి శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ... అన్ని శాఖల ప్రభుత్వాధికారులు లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన పెంచాలని కోరారు. లోకదాలత్ తీర్పు అంతిమంగా పరిగణిస్తారని చెప్పారు. ఎలాంటి ఫీజుల భారం లేకుండా పెండింగ్ కేసులను సత్వర పరిష్కారం పొందవచ్చని వివరించారు. వచ్చేనెల 9వ తేదీన జరగబోయే లోక్ అదాలత్‌ను అధికారులు, ఫిర్యాదారులు, కక్ష దారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి, జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శంఖారావంతో వైసీపీకి చావుగంట : సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10: నారా లోకేశ్ ప్రారంభించబోయే శంఖారావం కార్యక్రమంతో వైసీపీకి చావు గంట మోగుతుందని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి శని వారం ప్రకటనలో తెలిపారు. యువగళం పాద యాత్ర సాగని నియోజకవర్గాల్లో వైసీపీ అరాచకాలను ఎండగట్టేందుకు లోకేశ్ శంఖారావం పూరించడం హర్షనీయని తెలిపారు. లోకేశ్ సభల కోసం అన్ని వర్గాల ప్రజలు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. పాదయాత్రకు మించిన స్పందనతో శంఖారావం వేదికల్లో జనం వెల్లువెత్తడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. అదే శంఖారావం నాదంతో వైసీపీ అంతం కావడం తథ్యమని జోస్యం చెప్పారు.

కలశ పాత్రల వితరణ



కలశాలు అందజేస్తున్న చంగల్ రాజు దంపతులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10: ముక్కంటి ఆలయానికి రైల్వే కోడూరులోని ఆదర్శ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ అధినేత చెంగల్‌రాజు, కళావతి దంపతులు 108 కలశ పాత్రలను వితరణ చేశారు. ఆలయంలోని పరిపాలనా భవనంలో శనివారం చైర్మన్ అంజూరు శ్రీనివాసులను కలిసి అందజేశారు. అనుబంధ ఆలయాల కుంభాభిషేకం మహోత్స వాలకు ఉపయోగించేలా కలశ పాత్రలు సమర్పించామని దాతలు తెలిపారు. చైర్మన్ అంజూరు శ్రీనివాసులు వారికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

వీధిలైట్ల వివాదం.. ఇరువర్గాల ఘర్షణ.. ఒకరికి గాయాలు



గాయపడిన శోభన్‌బాబు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 10: ఇరువర్గాల మధ్య వీధిదీపాల వివాదం ఘర్షణకు దారి తీసింది. ఈ సంఘటన మండలంలోని కారి పాకంలో జరిగింది. కారిపాకంలో వీధిదీపాల విషయంపై వైసీపీకి చెందిన పంచాయతీ సచివాలయ కన్వీనర్ శోభన్‌బాబు, సర్పంచ్ ఆనంద్‌ను పరుష పద జాలంతో నిలదీశాడు. దీంతో ఇరువురి మధ్య వివాదం చెలరేగి ఘర్షణకు దారి తీసింది. సర్పంచ్ తనపై దాడి చేశాడని శోభన్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ కులానికి చెందిన సర్పంచ్ అనే చిన్న చూపుతో కులంపేరుతో దూషించాడని ఆనంద్ ఫిర్యాదు చేశారు. అంతేగాక టీడీపీకి చెందిన తనపై పార్టీపరంగా కక్షసాధింపు చర్యలో భాగంగా అసభ్య పదజాలంతో దూషించి చేయి చేసుకున్నాడని సర్పంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ ప్రతాప్ మాట్లాడుతూ విచారించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

13న హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10: ఈనెల 13వ తేదీన ముక్కంటి ఆలయంలో హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు డిప్యూటీ ఈవో వెంకట సుబ్బయ్య శనివారం ప్రకటనలో తెలిపారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఉదయం 7 గంటల నుంచి లెక్కింపు ప్రారంభం అవుతుందని తెలియజేశారు. హుండీ లెక్కింపు కోసం విధులు కేటాయించిన, అధికారులు సిబ్బంది నిబంధనల ప్రకారం సమయపాలనతో హాజరుకావాలని కోరారు.

మా భూములు మాకే ఇవ్వండి : గిరిజనులు



ధర్నా చేస్తున్న గిరిజనులు

రేణిగుంట, ఫిబ్రవరి10: తమకు సాగుభూములు మంజూరు చేయాలని చైతన్యపురం కాలనీలోని గిరిజనులు కోరారు. ఈ మేరకు శనివారం బాలాజీ రిజర్వాయర్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రిజర్వాయర్ కోసం తమ భూములు తీసుకున్నారని గుర్తుచేశారు. పొలాలు లేక తమకు ఉపాధి కరువైందన్నారు. ఇప్పటికీ రిజర్వాయర్ నిర్మించలేదన్నారు. అలాంటప్పుడు తమభూములు తమకు అప్పగిస్తే సాగుచేసుకుంటామని తెలియజేశారు.